



1200 మైలురాయికి యువగళం

నందికొట్కూరు నియోజకవర్గంలో హోరెత్తిన పాదయాత్ర

ప్రజాశక్తి - నందికొట్కూరు

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పాదయాత్ర బుధవారం నందికొట్కూరు నియోజక వర్గం అల్లూరులో 1200 కిలో మీటర్ల మైలురాయిని చేరుకుంది. ఈ సందర్భంగా హంద్రీనీవా నుంచి మిడుతూరు ఎత్తిపోతల పథకానికి లోకేష్ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నారా లోకేష్ మాట్లాడుతూ ఈ ఎత్తిపోతల పథకం ద్వారా మిడుతూరు, కలమందలపాడు, మాది గుండం, పారమంచాల చెరువులకు నీరు చేరుతుందన్నారు. తద్వారా 22 వేల ఎకరాలకు సాగునీరు, మిడుతూరు, జూపాడుబంగ్లా మండలాల్లో 60వేలమంది ప్రజలకు తాగునీరు అందుతుందన్నారు. 95వ రోజు యువగళం పాదయాత్ర నందికొట్కూరు నియోజకవర్గంలో హెూరెత్తింది. దారిపొడవునా జనం యువనేతకు ఎదురెళ్లి స్వాగతం పలికారు. వివిధ గ్రామాల ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలను యువనేతకు విన్నవించారు. మరో ఏడాదిలో రాబోయే చంద్రన్న ప్రభుత్వం మీ అందరి సమస్యలకు పరిష్కారం చూపుతుందని చెప్పి, ముందుకు సాగారు. గార్గేయపురం క్యాంప్ సైట్ నుంచి ప్రారంభమైన యువగళం పాదయాత్రకు అడుగడుగునా జనం నీరాజనాలు పలికారు. బ్రాహ్మణకొట్కూరు, కోళ్ల బావాపురం, వడ్డెమూరు, కోనేటమ్మపల్లి, అల్లూరు మీదుగా యువనేత లోకేష్ నందికొట్కూరుకు చేరుకున్నారు. పాదయాత్ర దారిలో ఎస్సీలు, ఎస్టీలు, బోయలు, గౌడలు, సర్పంచ్‌లు యువనేతను కలిసి తమ సమస్యలు చెప్పుకున్నారు. నందికొట్కూరు ఎస్ఎస్ ఫంక్షన్ హాలు వద్ద నిర్వహించిన బహిరంగసభకు నియోజకవర్గం నలుమూలల నుంచి ప్రజలు పెద్దఎత్తున హాజరయ్యారు. 95వ రోజు యువనేత లోకేష్ 17.9 కిలో మీటర్ల దూరం నడిచారు. ఇప్పటి వరకు యువగళం పాదయాత్ర 1206.9 కిలోమీటర్లు పూర్తయింది.

ఎమ్మెల్యేనే రోడెక్కి పోరాడాల్సిన పరిస్థితి

నందికొట్కూరు ఎమ్మెల్యేనే రోడెక్కి హక్కుల కోసం పోరాడాల్సిన పరిస్థితి ఏర్పడిందని నారా లోకేష్ పేర్కొన్నారు. నందికొట్కూరు బహిరంగ సభలో లోకేష్ మాట్లాడుతూ ఆర్డర్‌కు ఆర్డర్ వేసే అధికారాలు లేవన్నారు. జగన్ పాలనలో దళితులకు జరుగుతున్న అవమానం చూడాలి అంటే నందికొట్కూరు రావాలన్నారు. నందికొట్కూరుని వైసిపి నాయకులు భూకబ్జాలకు, అక్రమ మద్యానికి ల్యాండ్ సెటిల్మెంట్స్‌కి అడ్డాగా మార్చేసారన్నారు. నందికొట్కూరులో ఉన్న ఎన్టీఆర్ జలాశయాన్ని వైసిపి నేతలు కబ్జా చేసారన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే నందికొట్కూరు పట్టణంలో కేజీ రోడ్డు విస్తరణలో ఇళ్లు, భవనాలు, దుకాణాలు కోల్పోయే బాధితులకు నష్టపరిహారం అందిస్తామని హామీ ఇచ్చారు. మొక్కజొన్న రైతుల్ని ఆదుకుం టామని, అవసరమైన కొనుగోలు కేంద్రాలు, గొడౌన్స్ ఏర్పాటు చేసి గిట్టుబాటు ధర కల్పిస్తామని హామీ ఇచ్చారు. పాదయాత్రలో మాజీ మంత్రి భూమా అఖిల ప్రియ, టిడిపి జిల్లా అధ్యక్షులు గౌరు వెంకటరెడ్డి, ఎమ్మెల్సీ బిటి.నాయుడు, నియోజకవర్గ ఇన్చార్జి మాండ్ర శివానందరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గౌరు చరిత, బిసి జనార్ధన్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

రోగులను పశువులు అనుకున్నారా?

ఆదోని ఆస్పత్రి నిర్వహణపై కలెక్టర్ ఆగ్రహం

ప్రజాశక్తి - ఆదోని

ఆస్పత్రిలో విధుల పట్ల నిర్లక్ష్యం చర్యలు తీసుకుంటామని కలెక్టర్ డాక్టర్ జి.సృజన హెచ్చరించారు. రోగులు మనుషులనుకున్నారా... పశువులనుకున్నారా అంటూ వైద్యులను నిలదీశారు. ఆదోని ఆస్పత్రి పరిసరాలను , రోగుల ఇబ్బందులను చూసి కలెక్టర్ చలించి పోయారు. నిర్వహకులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిసర రోగులను పట్టించుకోని వైద్యులపై ప్రత్యేకంగా నిఘా ఉంచుతామని అన్నారు. బుధవారం ఆదోని ఏరియా ఆసుపత్రిని తనిఖీ చేశారు. ఆసుపత్రిలో వైద్యుల హాజరు, పనితీరు రోగులకు వసతుల కల్పన పై వివరాలు అడిగితెలుసుకున్నారు.ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ ఆసుపత్రి పరిసరాలను పరిశీలించారు. ఆస్పత్రిలో రోగులకు కల్పిస్తున్న సౌకర్యాలపై జిల్లా కలెక్టర్ సూపరిన్‌టెన్‌డెంట్ లింగన్న పారిశుధ్య కాంట్రాక్టర్ పై అసహనం వ్యక్తం చేశారు. రోగులకు బెడ్లు కొరత వేధిస్తుందని పలువురు ఆమె దృష్టికి తెచ్చారు. విద్యుత్ కోత సమయంలో తీవ్రమైన వేడికి ఉక్కిరి బిక్కిరి అవుతున్నామని రోగులు వాపోయారు. ఆస్పత్రిలో వార్డుల్లో టాయిలెట్లు శుభ్రం చేయడం లేదని దుర్వాసన వస్తుందని వాపోయారు. నీటి సౌకర్యం లేకపోవడం వల్ల మలమూత్ర విసర్జన కోసం బయటకు వెళ్లాల్సిన దుస్థితి ఉందని పలువురు విన్నవించారు. సమస్యలు విన్న కలెక్టర్ చలించిపోయారు. స్వయంగా టాయిలెట్లను ఆమె పరిశీలించి ఆసుపత్రి వైద్యుల పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదేమిటి పరిస్థితిని ఇక్కడికి వచ్చేవారు జంతువులు అనుకున్నారా అంటూ నిలదీశారు. కొందరు వైద్యులు విధులు పట్ల నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రైవేటు ఆసుపత్రులపై ఉన్న శ్రద్ధ ఇక్కడ చూపడం లేదని సిపిఐ నాయకుడు సుదర్శన్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. మెరుగైన వైద్యం అందించకుండా కర్నూలుకు రెఫర్ అంటూ చేతులు దులుపుకుంటు న్నారని వైద్యుల తీరుపై ఫిర్యాదు చేశారు. ఆసుపత్రిని వారానికి ఒకసారి తనిఖీ చేయాలని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌ను ఆదేశించారు

ఆసుపత్రికి వచ్చే రోగుల సంఖ్య ఎక్కువ ఉందని ఇక్కడ బెడ్ల కొరత కారణంగా ఒక బెడ్ పై ఇద్దరికీ వైద్యం చేస్తున్నారని త్వరలో పక్కన నిర్మించబోయే బిల్డింగ్ పూర్తయితే ఎటువంటి సమస్య ఉండదని కలెక్టర్ పేర్కొన్నారు.

అంతకుముందు జగనన్న లేఅవుట్ ప్రాంతాన్ని పరిశీలించారు. అక్కడ రోజుకు 100 ఇల్లు నిర్మాణ పనులు జరగాల్సి ఉండగా కేవలం ఒకటి రెండు నిర్మాణాలు జరుగుతుండడంతో జిల్లా కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. రోజువారీగా ఇళ్ల నిర్మాణ స్టేజీలు మారాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి, తహశీల్దార్ వెంకటలక్ష్మి , ఎంపిడిఒ గీతావాణి, హౌసింగ్ అధికారులు ఉన్నారు.


ఆదోని ఎమ్మెల్యే , వైద్యాధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సృజన


రోగులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సృజన

మహిళలు, చిన్నారుల భద్రతకు ప్రాధాన్యత

దిశ , 3వ పట్టణ పోలీసు స్టేషన్ల వార్షిక తనిఖీ

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

మహిళలు, చిన్నారుల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని డిఐజి ఎస్.సెంథిల్ కుమార్ ఆదేశించారు. కర్నూలు దిశా, మూడవ పట్టణ పోలీసు స్టేషన్లను కర్నూలు రేంజ్ డిఐజి ఎస్. సెంథిల్ కుమార్ జిల్లా ఎస్పి జి.కృష్ణకాంత్‌తో కలిసి బుధవారం వార్షిక తనిఖీ చేశారు. ఈ సందర్భం గా స్టేషన్లలోని పలు రికార్డులను పరిశీలించారు. ముందుగా పోలీసు గార్డు సిబ్బంది కర్నూలు రేంజ్ డిఐజికి గౌరవవందనం చేశారు. అనంతరం దర్యాప్తులు, పెండింగ్ కేసుల పురోగతిపై వివరాలను ఆరా తీసి , క్రైమ్ రివ్యూ చేశారు. సీజ్ చేసిన వాహనాలు, పోలీసుస్టేషన్ పరిసరాలను పరిశీలించారు. నూతన పోలీసుస్టేషన్ నిర్మాణానికి ప్రతిప్రాదనలు సిద్ధం చేయాలన్నారు. డిఐజి, పోలీసు అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. మహిళా పోలీసులతో మాట్లాడారు. పనితీరు గురించి సమీక్షించి దిశా నిర్దేశం చేశారు. పోలీసు సిబ్బందికి ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని డిఐజి సూచించారు. అనంతరం దిశ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన సందర్భంగా దిశ డిఎస్‌పి ఐ.సుధాకర్ రెడ్డి డిఐజికి, ఎస్‌పికి పూల బొకేలను ఇచ్చి స్వాగతం పలికారు. దిశా పోలీసుస్టేషన్‌ను బలోపేతం చేయాలన్నారు. సిబ్బంది నిబద్ధతో పని చేయాలన్నారు. దిశా పోలీసులు సమస్యాత్మక ప్రదేశాలలో ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయ మహిళా పోలీసులచే సమస్యాత్మక ప్రాంతాలలో, మహిళలు, చిన్నారుల భద్రతకు అవగాహన కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పోక్సో కేసులు ఏయే ప్రాంతాలలో ఎక్కువగా రిపోర్టు అవుతున్నాయో బాగా విశ్లేషణ చేసి గట్టి చర్యలు చేపట్టాలన్నారు. పోలీసుస్టేషన్‌ను ఆశ్రయించే బాధితుల సమస్యలు తెలుసుకోని , ఆ కుటుంబాలకు సైకాలజి నిపుణలచే బాగా కౌన్సిలింగ్ చేయించాలన్నారు. దంపతులకు పలుమార్లు కౌన్సెలింగ్ చేసి కేసుల వరకు పోకుండా, అదే విధంగా కోర్టులో కేసులు ఉంటే రాజీ కుదర్చుకునేట్లు వారికి అవగాహన కల్పించాలని, లోకదాలత్‌లో రాజీ అయ్యేలా చూడాలని దిశా నిర్ధేశం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐలు తబ్రేజ్, లక్ష్మయ్య, ఎస్సైలు కేశవ, సోనక్క పోలీసుసిబ్బంది ఉన్నారు.


దిశాం పోలీస్ స్టేషన్లో తనిఖీ చేస్తున్న డిఐజి ఎస్ సెంథిల్ కుమార్

కేంద్ర హోమ్ మంత్రి వ్యాఖ్యలు అభ్యంతరకరం

- ఎఐసిసి మెంబర్ జె లక్ష్మీ నరసింహ యాదవ్

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

దేశహోమ్ మంత్రి అమిత్‌షా ముస్లిం రిజ ర్వేషన్లపై చేసిన వ్యాఖ్యలు సుప్రీం కోర్టును అవమానపరచే విధంగా ఉన్నాయని అమిత్ షాపై కాంగ్రెస్ నంద్యాల పార్లమెంటు జిల్లా అధ్యక్షులు, ఎఐసిసి మెంబర్ జంగిటి లక్ష్మీ నరసింహ యాదవ్ విమర్శించారు. బుధవారం నంద్యాల చెక్ పోస్ట్ సమీపంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ అత్యున్నత పదవిలో కొనసాగుతూ న్యాయస్థానం విలువలు తగ్గించేలా మాట్లాడడం దురదృష్టకరమని వ్యాఖ్యానిం చారు. హోమ్ మంత్రి అమిత్ షా ఇటువంటి వ్యాఖ్యలు చేయడం వల్ల, సామాన్యులకు న్యాయ వ్యవస్థల పై నమ్మకం పోతుందని లక్ష్మి నరసింహాయాదవ్ అన్నారు. అమిత్‌షా సుప్రీం కోర్టు పరిధిలోని అంశంపై అనుచిత వ్యాఖ్యలను సుమోటోగా స్వీకరించి చర్యలు తీసుకోవాలని కోర్టు వారిని కోరుతున్నట్లు లక్ష్మీ నరసింహ యాదవ్ తెలిపారు. ఈ అంశంపై న్యాయస్థానంలో పోరాటం చేయబోతున్నట్లు లక్ష్మి నరసింహ యాదవ్ స్పష్టం చేశారు..



చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంప్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

24వ వార్డు వికాస్ స్కూల్లో ఏర్పాటు చేసిన కర్నూలు చిల్డ్రన్స్ క్లబ్ సమ్మర్ క్యాంపును యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి జయరాజు బుధవారం ప్రారంభించారు. క్లబ్ కన్వీనర్ ఉమాదేవి సమ్మర్ క్యాంప్ రిసోర్స్ పర్సన్ జి.పద్మజ క్యాంప్‌ను చక్కగా నిర్వహించారు. 40 మంది బాలబాలికల పాల్గొన్నారు, సుశాంత్ తదితరులు అందించారు. ఈ కార్యక్రమానికి చిన్నారుల నుంచి విశేష స్పందన లభించింది.


విద్యార్థులకు పాఠాలు నేర్పుతున్న దృశ్యం

అక్రమట్టి తవ్వకందారులపై చర్యలు తీసుకోవాలి

లేదంటే కలెక్టరేట్ ముట్టడి - ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

శ్రీ కాశి రామేశ్వర స్వామి ఆలయ భూముల్లో అక్రమంగా మట్టిని తవ్విన విషయం ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ కార్మిక సం ఘం జిల్లా సహాయ కార్యదర్శి బి.నాగన్న అధ్యక్షతన ఓర్వకల్లు ప్రజాసంఘాల కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకష్ణ పాల్గొని మాట్లాడుతూ శకునాల గ్రామంలోని సర్వే నంబర్ 155. 163.లో 18 ఎకరాల శ్రీ కాశి రామేశ్వర స్వామి దేవాలయ భూములలో అక్రమంగా సోలార్ రోడ్లకు వెంచర్లకు వివిధ రకాల అవసరాలకు 6.7 అడుగుల లోతుగా మట్టిని తవ్వి రూ.కోట్లు దండుకున్నారని విమర్శించారు. ఈ విషయంపై అనేకసార్లు మండల , జిల్లా అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా తమకు ఏమాత్రం పట్టనట్టు దేవాదాయ శాఖ అధికారులు వ్యవహరిస్తున్నారని అన్నారు. అధికార పార్టీకి చెందిన కాంట్రాక్టర్లు కావడంతో అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తూ భయపడుతున్నారని అన్నారు. రెండుసార్లు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లగా కలెక్టర్ రెండు రోజుల్లోపు నివేదిక ఇవ్వాలని దేవాదాయ శాఖ అధికారులు ఆదేశించినా చర్యలు లేవన్నారు. ఇప్పటికైనా తక్షణమే జిల్లా కలెక్టర్ స్పందించి ఆలయభూముల పైన విచారణ జరిపి భూములను తవ్వేసిన దొంగలపై వారికి సహకరి ంచిన వారిపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. పిచ్చుక మీద బ్రహ్మాస్త్రం వేసినట్లు గుడిపూజారిపై చర్యలు తీసుకుంటామనడం అన్యాయమని అన్నారు. తక్షణమే చర్యలు తీసుకోకపోతే కలెక్టర్ కార్యాలయం ముందు దీక్షలు చేపట్టి కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. ప్రజా సంఘాల నాయకులు శ్రీధర్, చంద్రబాబు నాయుడు మధుసూదన్,చాంద్ బాషా, సుధాకర్, శకునాల గ్రామస్తులు పాల్గొన్నారు.


రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు జి. రామకృష్ణ



చంద్రబాబు, లోకేష్ రాయలసీమ ద్రోహులు

వైసిపి రాష్ట్ర సహాయ కార్యదర్శి సిహెచ్.మద్దయ్య

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్ : టిడిపి అధినాయకులు చంద్రబాబు , ఆయన తనయుడు లోకేష్ రాయలసీమ ద్రోహులని వైసిపి రాష్ట్ర కార్యదర్శి సిహెచ్.మద్దయ్య అన్నారు. కర్నూలు నగరంలోని అంబేద్కర్ భవనంలో ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు. పథకాలను ప్రశ్నిస్తే ప్రజలు తిరగబడతారన్నారు. మంత్రులను, ఎమ్మెల్యేలను భూ కబ్జాదారులంటూ ఆరోపణలను అంటగడుతున్నారన్నారు. కర్నూలులో న్యాయ రాజధానిని టిడిపి వ్యతిరేకిస్తుందన్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి కర్నూలుకు న్యాయ రాజధాని ప్రకటిస్తే చంద్రబాబు లోకేష్ లు కర్నూలుకు బెంచి పేరుతో మాయ మాటలు చెబుతూ రాయలసీమకు ద్రోహం చేస్తున్నారని చెప్పారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రవేశపెట్టిన పథకాలను ప్రశ్నించలేక ముఖ్యమంత్రి, మంత్రులను, ఎమ్మెల్యేలను టార్గెట్ చేస్తున్నారని, భూ కబ్జాదారులంటూ ఆరోపణలను లోకేష్ అంటగడుతున్నారని తెలిపారు. కర్నూల్‌లో హైకోర్టు ఏర్పాటు పై మీ విధానం ఏమిటని లోకేష్‌ను ప్రశ్నించడానికి తాను వెళితే దళిత నాయకుడు అని చూడకుండా పోలీసులు నెట్టుకెళ్ళడం బాధాకరమన్నారు. రాయలసీమకు న్యాయ రాజధాని వైసిపి ఇస్తే టిడిపి వ్యతిరేకిస్తుందన్నారు. అరుణ్, విజయ్, కర్ణ, అనిల్ జయరాం పాల్గొన్నారు.

నిందితుడి అరెస్టు

ప్రజాశక్తి-తుగ్గలి : మండల పరిధిలోని ఎద్దుల దొడ్డి గ్రామంలోని ట్రాక్టర్, ట్రాలీని దొంగలించిన కేసులో నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు తుగ్గలి ఎస్ఐ మల్లికార్జున బుధవారం విలేకరులకు తెలిపారు. గత నెల 27న తుగ్గలి మండలం ఎద్దులదొడ్డి చివరలో ఉన్న ట్రాక్టర్లు, ట్రాలీని దొంగలించారు. దీంతో బాధితుడు తుగ్గలి పోలీస్ స్టేషలో కేసు నమోదు చేశాడు. తాము, తమ సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టామన్నారు. బుధవారం హనుమానస్పదంగా తిరుగుతున్న హోసూరు గ్రామానికి చెందిన వ్యక్తిని పట్టుకుని విచారించగా దొంగతనానికి పాల్పడిన వారి పేర్లు వెల్లడించినట్లు తెలిపారు. నిందితునితో పాటు ట్రాక్టరు, ట్రాలీని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

ప్రజాసమాచార సర్వేపై వీడియో కాన్ఫరెన్స్

ప్రజాశక్తి- సి బెళగల్ : ప్రజాసమాచారం సర్వేపై వెలుగు కార్యాలయంలో ఎపిఎం వెంకటస్వామి బుధవారం వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రపంచంలో. ఎక్కడైనా ఆన్‌లైన్ ద్వారా కుటుంబ వివరాలు తెలుసుకొనేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. వెలుగు కార్యాలయంలో పది రోజుల పాటు ఈ కాన్ఫరెన్స్ ఉంటుందన్నారు. వెలుగు సిబ్బంది పాల్గొనాలన్నారు.

జవాబుదారీ తనం పెంచేలా చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ప్రజలకు మరింత సులభ తరంగా ఉండేందుకు, పరిష్కారంలో జవాబుదారీ తనం పెంచేలా 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం అమలు అవుతోందని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన వెల్లడించారు.. బుధవారం జిల్లా కలెక్టర్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రజల సమస్యలను మరింత బాధ్యతతో పరిష్కరించేందుకు 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి మంగళవారం ప్రారంభించారన్నారు. ఇప్పటివరకు ప్రతి సోమవారం కలెక్టరేట్లోనూ, మండలాల్లోనూ స్పందన కార్యక్రమం ద్వారా ప్రజల నుండి సమస్యలను స్వీకరించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమాన్ని మరింత అప్‌గ్రేడ్ చేసి ప్రజలకు మరింత చేరువయ్యేలా జగనన్నకు చెబుదాం అనే కార్యక్రమాన్ని ప్రభుత్వం రూపొందించిందన్నారు. స్పందన ద్వారా కలెక్టరేట్లోనూ, మండల కార్యాలయాల్లో సమస్యను రిజిష్టర్ చేసుకుని, రసీదు పొంది సమస్యను తెలుపుకోవచ్చని, మరో పద్ధతి ద్వారా సచివాలయాలకు వెళ్లి సమస్యను ఇవ్వవచ్చని, మరో పద్ధతిలో డైరెక్ట్‌గా వెబ్‌సైట్‌కు వెళ్లి సమస్య తెలుపుకోవచ్చని, ప్రముఖమైన పద్ధతి 'జగనన్నకు చెబుదాం' ద్వారా 1902 నంబర్‌కు కాల్ చేసి సమస్యను తెలియజేయ వచ్చని కలెక్టర్ స్పష్టం చేశారు. జగనన్నకు చెబుదాం ద్వారా 1902కి ఎవరైనా, ఎక్కడి నుంచి అయినా కాల్ చేయవచ్చన్నారు. ఇంతకుముందున్న కార్యక్రమానికి ఈ కార్యక్రమానికి ఉన్న వ్యత్యాసం ఏంటంటే ఫోన్ కాల్స్ ద్వారా అందిన ఫిర్యాదులను సీఎంఒ కార్యా లయం నేరుగా పర్యవేక్షిస్తుందన్నారు. ఇందు కోసం సీఎం కార్యాలయంలో ప్రాజెక్ట్ మానిటరింగ్ యూనిట్ ఏర్పాటు చేశారని, ఇందులో వివిధ శాఖలకు సంబంధించిన అధికారులను నియమించి, ఫిర్యాదుల పరిష్కారాన్ని ఫాలో అప్ చేస్తారన్నారు. జగనన్న చెబుదాం ద్వారా వచ్చిన సమస్యలకు నాణ్యతకు చాలా ప్రాముఖ్యత ఇస్తారన్నారు. పరిష్కారం అయిన సమస్యపై కూడా ఆడిట్ చేస్తామన్నారు. ఒక వేళ లబ్ధిదారులకు సంతృప్తిగా లేకపోతే ఆ సమస్యను రీ ఓపెన్ చేసి ఆ సమస్యను పై అధికారి వద్దకు పంపుతామని కలెక్టర్ వివరించారు. నిబంధనల ప్రకారం లేకపోతే ఏ కారణంగా చేయ లేకపోతున్నామనే విషయాన్ని పూర్తి వివరంగా ఎండార్స్‌మెంట్ ఇస్తా మన్నారు. సచివాలయాలు, వాలంటీర్ల ద్వారా ఈ కార్యక్రమంపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పిస్తామని కలెక్టర్ వివరించారు. సమావేశంలో డిఆర్ఓ నాగేశ్వరరావు పాల్గొన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ సృజన



రాతి దూలం పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-తుగ్గలి

మండలం పరిధిలోని పగిడిరాయి గ్రామంలో నిర్వహించిన రాతిదూలం పోటీలను మాజీ జడ్‌పిటిసి జగన్నాథ్‌రెడ్డి, టిడిపి నాయకులు ఈశ్వర్ రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ గ్రామాలలో రాతిదూలం పోటీలు నిర్వహించడం హర్షించదగ్గ విషయమన్నారు. గతంలో పోటీలు చూడాలంటే వివిధ ప్రాంతాలకు వెళ్లే వారని ప్రస్తుతం అన్ని గ్రామాలలో పండుగకు వివిధ రకాల పోటీల నిర్వహించడం సంతోషించదగ్గ విషయమని అన్నారు. గ్రామీణ ప్రాంతాలలో అన్ని రకాల పండగలకు రాతిదూలం పోటీలు, కబడ్డీ, చెక్కభజన తదితర పోటీలను ప్రారంభిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఆదెమ్మ, భక్త రంగన్న, సర్పంచి సౌజన్య, వాల్మీకి సేవాదళ్ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

గాలి వాన బీభత్స బాధితులను ఆదుకుంటాం

ప్రజాశక్తి -సి బెళగల్

మండలంలోనీ బ్రాహ్మణ దొడ్డిలో గాలి,వాన బీభత్సానికి తీవ్రంగా నష్టపోయిన బాధితుల కుటుంబాలను ఆదుకుంటా మని తహసీల్దార్ శివశంకర్ నాయక్ బుధవారం మీడియాలో పేర్కొన్నారు. శంకరన్న, మరో వ్యక్తికి చెందిన రెండు కొట్టాలు గాలికి లేచిపోగా కొట్టంలోని వస్తు సామాగ్రితో పాటు బియ్యం మొత్తం వానకు తడిసిపోయింది.. దీంతో సుమారు రూ.6 లక్షలు నష్టం జరిగినట్లు బాధితుల మొర మేరకు ప్రభుత్వానికి నివేదికలు పంపిస్తున్నట్లు అధికారులు తెలిపారు.


ఇంటిని పరిశీలిస్తున్న అధికారులు

అధికారుల సుడిగాలి పర్యటన

ప్రజాశక్తి సి బెళగల్

అభివద్ధి పనులపై అధికారులు తహసీల్దార్ శివశంకర్ నాయక్, ఎంపిడిఒ రాముడు, వైద్యులు సునీతా సిబ్బంది బుధవారం సుడిగాలి పర్యటన చేశారు. బ్రాహ్మణ దొడ్డిల సచివాలయం తనిఖీ చేశారు. మారందొడ్డిలో డ్రెయినేజీ, బురాన్ దొడ్డిలో జగనన్న కాలనీ, బెళగల్ లో ఫిష్ ఆంధ్ర, పోలకల్‌లో హెల్త్ కేర్ బిల్డింగ్ ఇలా ఆయా అభివద్ధి పనులను పరిశీలించారు. విధుల పట్ల బాధ్యతగా పనిచేయాలని సిబ్బందిని ఆదేశించారు.

'ఉపాధి హామీ'కి కేంద్రం తూట్లు


కూలీలనుద్దేశించి మాట్లాడుతున్న కెవి.నారాయణ

ఎపి వ్యవసాయ కార్మికసంఘం

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

గ్రామీణ పేదలకు పట్టెడు అన్నం పెడుతున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతున్నదని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కెవి.నారాయణ విమర్శించారు. బుధవారం కల్లూరు మండలం ఉలిందకొండ గ్రామపంచాయతీ పరిధిలో ఉలిందకొండ, ఎర్రకత్వ, తండా గ్రామాల ప్రజలు పనిచేస్తున్న పని ప్రదేశానికి జిల్లా కార్యదర్శి కెవి.నారాయణ, సిఐటియు మండల కార్యదర్శి కె. మధు, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి రామాంజనేయులలతో కలిసి వ్యవసాయ కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారు మాట్లాడుతూ ఉపాధి హామీలో నూతనంగా తెచ్చిన మార్పుల్లో వేసవిలో వచ్చే అలవెన్సులు, కూలీలు తాగేందుకు మంచినీళ్లు తీసుకెళ్తే వాటికి పది రూపాయలు చెల్లించేవాళ్ళు అది తొలగించేశారని అన్నారు. పని ప్రదేశంలో మెడికల్ కిట్లు, ప్రమాదం జరిగితే ఎక్స్‌గ్రేషియా చెల్లించేవాళ్ళు వీటిని తొలగించి, సంవత్సరానికి జిల్లాలో రూ.35 కోట్ల పని దినాలు చేస్తుంటే , ఈ సంవత్సరం కేవలం రూ.15 కోట్ల పరిధిలో మాత్రమే కల్పిస్తున్నారు అన్నారు. ఈనెల 22న జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నాను జయప్రదం చేయాలన్నారు. ఉపాధి హామీ రక్షణ కోసం మీరంతా పోరాటంలో భాగస్వాములు కావాలని వారు ఉపాధి కూలీలను కోరారు.

22న కలెక్టర్ కార్యాలయం ముందు మహాధర్నా

కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే కుట్రలను మానుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బి నాగన్న డిమాండ్ చేశారు. ఓర్వకల్లు మండలం నన్నూరు గ్రామ ఉపాధి పనులను బి.నాగన్న, రామస్వామిలు పరిశీలించారు. కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నాయకులు మాసుంబాష , బషీర్ ఉపాధి మెట్లు అర్జున్, సునీల్ ఉపాధి కూలీలు పాల్గొన్నారు.


కూలీలనుద్దేశించి మాట్లాడుతున్న నాగన్న


బాధ్యతలు స్వీకరించిన డిఎస్పి శివ నారాయణస్వామి

ఆదోని డిఎస్‌పిగా శివ నారాయణస్వామి

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని డీఎస్పీగా శివ నారాయణస్వామి బుధవారం కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. అంతకుముందు ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డిని, ఎమ్మెల్సీ మధుసూదన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛంతో వారు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా డిఎస్పి మాట్లాడారు. ఏసీబీ నుండి తనను ఆదోనికి డిఎస్పీగా బదిలీ చేశారని తెలిపారు. ప్రజలు నిర్భయంగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయవచ్చున్నారు. ఎవ్వరైనా నిర్లక్ష్యంగా వ్యవహరించిన తన దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా వ్యవహరిస్తానని తెలిపారు.


నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న తిక్కా రెడ్డి, తదితరులు

వివాహ వేడుకలో టిడిపి నియోజకవర్గ ఇంచార్జీ తిక్కారెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

మండల పరిధిలోని రచ్చుమర్రి గ్రామ టిడిపి అధ్యక్షులు బంద్రాళ్ళ నరసింహ కుమారుడి వివాహ వేడుకలకు టిడిపి నియోజకవర్గ ఇంచార్జీ పాలకుర్తి తిక్కారెడ్డి హాజరయ్యారు. బుధవారం ఆ పార్టీ మండల అధ్యక్షులు పన్నగ వెంకటేష్ స్వామితో కలిసి గ్రామానికి చేరుకున్న వారికి నరసింహులు శాలువతో పూల మాలలు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నూతన దంపతులను ఆశీర్వాదించారు. ఈ కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంత్ రెడ్డి, తెలుగు రైతు జిల్లా కార్యదర్శి సత్యనారాయణ రెడ్డి, చావిడి వెంకటేష్, మాజీ ఎంపిటిసి సభ్యులు అమర్నాథ్ రెడ్డి, చిలకలడోణ హనుమంతు లక్ష్మారి గ్రామ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.


స్థానిక ప్రజలతో మాట్లాడుతున్న డిఎస్‌పి సీతారామయ్య

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

- డిఎస్‌పి సీతారామయ్య

ప్రజాశక్తి - మంత్రాలయం

గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డిఎస్పి సీతారామయ్య హెచ్చరించారు. బుధ వారం మండల పరిధిలోని రచ్చుమర్రి గ్రామంలో ఆయన పర్యటించారు. ఇటీవల దళిత మహిళ కిడ్నాప్‌పై భర్త ఫిర్యాదు చేసిన నేపథ్యంలో మాధవరం పోలీస్టేషన్‌లో కేసు నమోదు చేసుకున్నారు. రాజకీయ ఒత్తిడి కారణంగా జడ్పీటీసీ మజ్జిగ గోవిందమ్మ కుమారుడు రోగప్ప అలియాస్ లక్ష్మయ్యను అరెస్టు చేయలేదని మాల మహానాడు ఆధ్వర్యంలో ఎస్పీ కృష్ణకాంత్‌ను డియస్పీ సీతారామయ్యను రోగప్పపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేసిన నేపథ్యంలో డియస్పీ విచారణ చేపట్టారు. గ్రామంలో ఏలాంటి అల్లర్లకు పాల్పడరాదని, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిమీద ప్రజలను భయభ్రాంతులకు గురి చేసే వారి మీద చట్ట ప్రకారం కఠిన చర్య తీసుకుంటామని అన్నారు. గ్రామంలో ఏమైనా సమస్యలు ఉంటే పోలీస్ అధికారుల దృష్టికి తీసుకొని రావాలని చట్టప్రకారం న్యాయం చేస్తామని తెలిపారు. ఆయన వెంట సిఐ శ్రీనివాసులు, ఎస్ఐ కిరణ్ బాబు, ఇతర పోలీస్ సిబ్బంది ఉన్నారు.


కౌల రైతులతో మాట్లాడుతున్న న ఏవో ఆనంద్

కౌలు రైతులకు న్యాయం జరిగేలా చూస్తాం : ఎఒ

ప్రజాశక్తి - చిప్పగిరి

మండల పరిధిలోని 16 గ్రామాలలో భూ యజమానుల నుంచి పొలమును కౌలుకు తీసుకునే రైతులకు ప్రభుత్వం నుంచి వచ్చే నష్టపరిహారమును వచ్చే విధంగా కౌలు గుర్తింపు కార్డుల ద్వారా న్యాయం చేస్తామని వ్యవసాయ శాఖ అధికారి ఆనంద్ లోక దళ్ కౌలు రైతులకు సూచించారు. బుధవారం రామదుర్గం, నగర డోనా, నేమకల్లు గ్రామాలలోని రైతు భరోసా కేంద్రాలలో కౌలు రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌలుకు తీసుకున్న ప్రతి రైతు భూ యజమానులతో సంతకంతో కూడిన అనుపతి పత్రము పొందవలసి ఉందన్నారు. భూములేని రైతులు కౌలు కార్డుల ద్వారా రైతు భరోసా పొందడానికి, పంట బీమా, పంట నష్టం పొందడానికి, ఇతర ప్రభుత్వ పథకాలు పొందడానికి అవకాశం ఉందన్నారు. పొలము పాసు పుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్ కాపీలను తమ దగ్గరే ఉన్న రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి వివరాలు తెలుసుకొని అక్కడే నమోదు చేసుకోవచ్చున్నారు. కౌలు కార్డులు 11 నెలలు వర్తి ంచేలా చేస్తామన్నారు. అగ్రికల్చర్ అసిస్టెంట్ సునీత, రాకేష్, రైతులు పాల్గొన్నారు.

స్పీడ్ బేకర్ వేయాలి : కెవిపిఎస్

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

మండలం పరిధిలో పెద్ద హరివనం గ్రామ బస్టాండ్‌లో రోడ్డుకు స్పీడ్ బేకర్ వేసి ప్రాణాలను కాపాడాలని కాపాడాలని కెవిపిఎస్ మండల ప్రధాన కార్యదర్శి బి.తిక్కప్ప డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక బస్టాండ్ ఆవరణంలో కెవిపిఎస్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పెద్ద హరివాణం బస్టాండులో రోడ్డుకు స్పీడ్ బ్రేకర్ లేనందువల్ల ఎక్కువగా ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నాయని, వాహనాలు కూడా ఎక్కువగా తిరుగుతున్నాయని కానీ సంబంధిత అధికా రులు మాత్రం స్పీడ్ బ్రేకర్ వేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా ఉన్నారని అని తెలియజేశారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించే బస్టాండ్ రోడ్డుకు స్పీడ్ బ్రేకర్ వేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజలను సమీకరించి రోడ్డు దిగ్బంధం కార్యక్రమం చేస్తామని తెలి యజేశారు. ఈ నిరసన కార్యక్రమంలో గ్రామస్తులు గురు బసవ, లింగప్ప, రఘు, హనుమంతు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కెవిపిఎస్ నాయకులు

12న మహాయోగి లక్ష్మమ్మ రథోత్సవం

ప్రజాశక్తి-ఆదోనిరూరల్



మహాయోగి లక్ష్మమ్మ ఆదోనికి 7 కిలో మీటర్ల దూరంలో గల మూసానిపల్లె గ్రామంలో ఒక నిరుపేద దళిత కుటుంబంలో మంగమ్మ, బండెప్ప దంపతులకు జన్మించారు. బాల్యం నుంచే అవధూ తగా సంచరిస్తూ ఉండేవారు. పిచ్చిపిచ్చిగా మాట్లాడుతూ, నగ్నంగా సంచరించే ఆమెను పిచ్చిదని అందరూ భావించే వారు. ఆమె నిజతత్వాన్ని తెలుసుకోలేని సామాన్య ప్రజలు పెళ్ళిచేస్తే పిచ్చి కుదురుతుందని భావించి మారెప్పతో పెళ్ళి జరిపించారు. పెళ్ళి రోజు రాత్రే ఆమె యథాప్రకారంగా దిగంబరంగా తిరిగివచ్చి పుట్టింటికి చేరింది. ఆమెను పిచ్చిదానినిగా భావించి ఆమెను రాళ్ళతో కొట్టి హింసించారు. ఆమెపై దాడిచేసిన వారు ఇబ్బందులకు గురయ్యారు. ఆమె దైవాంశసంభూతురాలని కొందరు నమ్ము తారు. 1933 మే 15న సమాధిలో ప్రవేశించారు. అప్పటి నుంచీ అవ్వ సమాధి చెందిన రోజున ప్రతి సంవత్సరం రథోత్సవం వైభవంగా నిర్వహిస్తారు. ఆదోని మాజీ ఎమ్మెల్యే రాచోటి రామయ్య ఆధ్వర్యంలో అవ్వకు వెండిరథం దేవాల యానికి వెండిరేకుల తాపడం, అవ్వ విగ్రహానికి బంగారు కవచం, అనేక బంగారు ఆభరణాలు, నూతన శోభ చేకూర్చి ంది. అవ్వమందిరం దినదినాభివద్ధి చెందుతూ దేశంలోని అనేక ప్రాంతాలనుంచీ భక్తులను విశేషంగా ఆకర్షిస్తున్నది.



12న రథోత్సవం

పట్టణ వాసులకే కాదు ఇతర రాష్ట్రాల్లోనూ భక్తులు ఉన్నారు. 91వ వెండి రథోత్సవ కార్యక్రమం ఈ నెల 12న వైభవంగా జరగనుంది. రథోత్సవం తిలకించేందుకు జిల్లా నలమూల నుంచే కాకుండా కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి యాత్రికులు అధిక సంఖ్యలో తరలిరానున్నారు. 12న శుక్రవారం ఉదయం 5 నుంచి 10 గంటల వరకు మహాయోగి లక్ష్మమ్మవ్వ మూలవిరాట్టుకు, బృందావనానికి, శిలాపాదుకలకు అభిషేకం, పుష్ప అలంకారాది పూజలు చేస్తారు. అనంతరం భక్తులకు అన్నదానం చేస్తారు. ఆమె పేరుతో సమాజ సేవలో భాగస్వాములు అవుతున్నారు.

భక్తుల సహకారంతో వెండి రథం

భక్తుల సహకారంతో ఆలయం నిర్వాహకులు 85 ఏళ్ల క్రితం వెండి రథం ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఈ రథంలోనే అవ్వ ఊరేగుతున్నారు. అవ్వమూల విరాట్, ఉత్సవ విగ్రహంతో పాటు ఆలయంలోని అవ్వ గర్భగుడి, బృందావనానికి కూడా వెండి తొడుగులు ఏర్పాటు చేశారు. పట్టణ ప్రముఖులు రాచోటి కుటుంబానికి చెందిన వారు ఆలయానికి వంశపారంపర్య ధర్మకర్తగా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం మాజీ ఎమ్మెల్యే రాచోటి రామయ్య ధర్మకర్తగా వ్యవహరిస్తున్నారు.

రథోత్సవం అగ్రభాగాన దళితులు

అవ్వ రథోత్సవంలో ముసానపల్లికి చెందిన దళితులు అగ్రభాగాన కొనసాగుతారు. దళితులు రథోత్సవంలో అగ్రభాగాన ఉండడం అవ్వ సంకల్పంగా పేర్కొంటారు. దళిత ముత్తయిదువులు కళశాలతో కొనసాగగా..పురుషులు కాషాయం జెండాలతో నడుస్తారు. ఉదయమే పల్లకోత్సవంతో ముసానపల్లె నుంచి ఊరేగింపుగా వచ్చి ఆలయానికి చేరి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ముసానపల్లెలో కూడా ఆలయం నిర్మించారు. అక్కడ కూడా మహాయోగిని నిత్య పూజలు అందుకుంటున్నారు.

గొర్రెలు, మేకలకు ఆరోగ్య శిబిరం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

మండలంలోని కడివేళ్ల గ్రామములో గొర్రెలు, మేకలకు సోమవారం నాడు వైద్య శిబిరం నిర్వహించారు. అనారోగ్యం గల జివాలకు చికిత్స చేసి మందులు అందించారు. ఈ సందర్భంగా మండల పశువైద్యాధికారి డాక్టర్ అశోక్ కుమార్ మాట్లాడుతూ ప్రధానమంత్రి కృషి సించాయీ యోజన పథకం కింద వాటర్ షెడ్ వారి ఆధ్వర్యంలో పశుసంవర్ధక శాఖ తరుపున ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించడం జరిగిందన్నారు. కడివేళ్ల సర్పంచ్ రంగస్వామి,వాటర్ షెడ్ సిబ్బంది శివ, పశు వైద్యసిబ్బంది, అనిమల్ హస్బెండ్రి అసిస్టెంట్ పవన్ పాల్గొన్నారు.

కల్తీ విత్తనాలను సీజ్ చేయాలి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణంలో కల్తీ విత్తనాలు, బిల్లులు లేని విత్తనాలను విక్రయిస్తున్న పేస్టిసైడ్స్ దుకాణాలను సీజ్ చేసి, యజమానాన్ని అరెస్టు చేయాలని సిపిఐ పట్టణ కార్యదర్శి జి.రంగన్న డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మిగనూరులో అమాయక రైతులను ఆసరాగా చేసుకుని మాయ మాటలు చెప్పి నకిలీ విత్తనాలను అమ్ముతున్నారన్నారు. ఎమ్మిగనూరు కల్తీ విత్తనాలకు కేంద్ర బిందువుగా మారిందన్నారు. పట్టణంలోని త్రివేణి ఆగ్రోఎంటర్ప్రైజెస్ కల్తీ విత్తనాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిందని ఆరోపించారు. ఆ దుకాణంలో విత్తనాలను కొని రైతులు పంటలు వేసుకోవడం జరిగిందని, పంటలు చేతికి రాకపోవడంతో నకిలీ విత్తనాలని తేలడంతో రైతులు రోడ్డున పడ్డారని పేర్కొన్నారు. నకిలీ విత్తనాల వల్ల సర్వం కోల్పోయిన వందలాది మంది రైతులతో త్రివేణి ఆగ్రో ఎంటర్ప్రైజెస్ దుకాణం ముందు సిపిఐ ఆందోళన చెపట్టిందని అన్నారు. వర్షాకాలం సమీపిస్తున్న వేళ పత్తి,మిరప నకిలీ విత్తనాలను అరికట్టాలని కోరారు.

14న శ్రీ సుదర్శన శిఖర కలశ ప్రతిష్టాపన

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణంలోని 11వ వార్డు పాత శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో శ్రీ సుదర్శన శిఖర కలశ ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమం జరగనున్నట్లు నిర్వాహకులు, దేవాలయ అర్చకులు, బలకుంది నరసింహ శాస్త్రి బుధవారం తెలిపారు. ఈనెల 12 , 13 , 14 తేదీలలో స్వామివారికి గంగపూజ, గోపూజ, గణపతి, మాతక పూజలు జరుగుతు న్నట్లు తెలిపారు. 13వ తేదీ శనివారము సుదర్శన కలశ శోభాయాత్ర ఊరేగింపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 14వ తేదీ ఆదివారం ఉదయం తొమ్మిది గంటలకు కలశం ప్రతిష్ట ప్రతిష్టాంగ పవమాననిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమములను ఋగ్వేదీయ స్మార్తగమ జ్యోతిష్య పండితులైన బల కుంది నటరాజశాస్త్రి ఆధ్వర్యంలో జరుగుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి

అసైన్డ్ భూ పంపిణీలో అవినీతికి పాల్పడితే చర్యలు

- ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

అసైన్డ్ భూముల పంపిణీల్లో అధికారులు అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి హెచ్చరించారు. బుధ వారం మండల పరిధిలోని ఎమ్మెల్యే స్వగ్రామమైన రాంపురంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్. జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు అసైన్డ్ మెంట్ భూములను అర్హత ఉన్న పేదలకు పంపిణీ చేసేందుకు అధికారులు ఇప్పటికే నివేదికలు తయారు చేశారని పేర్కొన్నారు. నివేదికల్లోని పేదల వద్ద నుంచి ఎవ్వరైనా డబ్బులు వసూలు చేయడం గానీ అడిగినట్లు గానీ తమ దృష్టికి తీసుకుని రావాలని కోరారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుని వెళ్లడమే కాకుండా చర్యలకు సిఫారసు చేయడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు. కావున నియోజకవర్గంలోని ప్రజలందరూ ఈ విషయాన్ని గమనించి ఎవ్వరూ కూడా డబ్బులు ఇవ్వడం చేయకూడదని సూచించారు.


మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

విభజన హామీలను అమలు చేయాలి: సిఐటియు

ప్రజాశక్తి-పెద్దకడబూరు

ఏపీ విభజన చట్టంలోని హామీలను కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఈరన్న డిమాండ్ చేశారు. బుధ వారం పెద్దకడబూరు మండలంలోని సొసైటీలో సిఐటియు కార్యకర్తల సమావేశం సిపిఎం మండల కార్యదర్శి తిక్కన్న గౌడ్, పరమేష్, ఉప్పర శ్రీనివాసులు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ 2023లో ఆంధ్రప్రదేశ్‌కు తీరని అన్యాయం చేసిందని పేర్కొన్నారు. బడ్జెట్లో ఉపాధి కల్పన దేశీయ డిమాండు ప్రజలు కొనుగోలు శక్తిని పెంచడం వంటి కీలక అంశాలను ప్రస్తావించలేదన్నారు.

ఏరియా ఆస్పత్రిలో సిటీ స్కానింగ్ ఏర్పాటు చేయండి : జనసేన

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో సిటీ స్కాన్ ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని జనసేన నాయకులు కోరారు. కర్నూలు జిల్లా కలెక్టర్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి పరిశీలనకు వచ్చిన సందర్భంగా జనసేన పార్టీ బృందం ఏరియా ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలతో కూడినటువంటి వినతి పత్రాన్ని కలెక్టర్ సృజనకు ఇచ్చారు. అనంతరం జనసేన పార్టీ నాయకులు యం.తాహేర్ వలి, రేణువర్మ, పులి రాజు మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో పడకలు లేకపోవడంతో ఒక మంచం పైన ఇద్దరు రోగులు చికిత్స పొందుతున్న పరిస్థితి నెలకొందన్నారు. సిటీ స్కానింగ్ పరికరం లేకపోవడంతో వైద్యం కోసం వచ్చిన వారు ప్రైవేట్ ఆర్బిట్ సెంటర్, కృష్ణ ఆసుపత్రిలో ఉన్న సిటీ స్కానింగ్ సెంటర్‌కు వేల రూపాయలు ఖర్చు చేసే పరీక్షలు చేయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. వెంటనే ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సిటీ స్కానింగ్ పరికరాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ఆదోని మాతా శిశు ఆసుపత్రిలో నెలలో ఒక్కరోజు మాత్రమే గర్భిణీ స్త్రీలకు స్కానింగ్ సదుపాయం కల్పించడంతో గర్భిణీ స్త్రీలు ప్రైవేట్ నర్సింగ్ హోమ్‌కు వెళ్లి వేల రూపాయలు ఖర్చు చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు ఆసుపత్రులు పేరుకు మాత్రమే పెద్ద ఆసుపత్రులుగా ఉన్నాయని సమస్యల నిలయంగా మారిపోయాయని సమస్యలు పరిష్కరించండి అంటూ ఆదోనిలో ఉన్న అధికారులకు ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు విన్నవించినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదన్నారు. ప్రత్యేక దృష్టి ఉంచి ఆదోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రుల సమస్యను పరిష్కరించాలని కోరారు. జనసేన పార్టీ నాయకులు చంద్రశేఖర్, గోవిందు, సిద్దు, తిమ్మప్ప, వెంకటేష్, జయరాం ఉన్నారు.


కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చిన జనసేన నాయకులు

ప్రొటోకాల్ పాటించని అధికారులపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - హోళగుంద

ప్రొటోకాల్ పాటించని అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎండిహల్లి గ్రామ సర్పంచ్ సుధాకర్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బుధవారం నాడు కర్నూలోని జిల్లా పంచాయతీ అధికారి నాగరాజును కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచి సుధాకార్ మాట్లాడుతూ మండల అధికారులు ఎంపీడీఓ దాస్ నాయక్, ఏపీఓ శ్రీనివాస్‌లపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. సర్పంచ్ అయినా తనకు సమాచారం ఇవ్వకుండా గ్రామ ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌ను తొలిగించడం అన్యాయం అన్నారు. ఎటువంటి మీటింగ్ కానీ, గ్రామ సభ అయినా నిర్వహించికుండా ఎలా తొలగిస్తారని ప్రశ్నించారు. అధికారులు పైన వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.


జిల్లా పంచాయతీ అధికారికి వినతి పత్రం ఇస్తున్న సర్పంచి సుధాకర్

నూతన డిఎస్‌పిని కలిసిన వాల్మీకి నాయకులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఎమ్మిగనూరు సబ్ డివిజన్‌కు మొట్టమొదట సారిగా డిఎస్పీగా పదవీ బాధ్యతలు చేపట్టిన సీతారామయ్యను పట్టణ వాల్మీకి సంఘం నాయకులు వీజీఆర్ కొండయ్య ఆధ్వర్యంలో బుధవారం స్థానిక డిఎస్పి కార్యాలయంలో కలిశారు. డిఎస్పీ సీతారామయ్యను ఎమ్మిగనూరు తాలూకా వాల్మీకి సంఘం నాయకులు వీజీఆర్ కొండయ్య, పుండుకూరు రంగన్న, యాపిలయ్య, గాజులదిన్నె నాగరాజు, యల్లంబీడు లక్ష్మన్న, రాజ్ కుమార్ నాయుడు, నాగేష్ నాయుడు, రామాంజనేయ్య తదితరులు మర్యాద పూర్వకంగా కలిసి శాలువా కప్పి పూలమాలతో ఘనంగా సన్మానించారు.


డిఎస్పీకు సన్మానం చేస్తున్న దృశ్యం

ఆమె వేసిందే తూకం..

- ఎంఎల్ఎస్ పాయింట్లలో అవకతవకలకు పాల్పడుతున్న ఇంచార్జీ శ్రీదేవి

- దోపిడీకి గురవుతున్న డీలర్లు - కన్నెత్తి చూడని జిల్లా అధికారులు

ప్రజాశక్తి -హోళగుంద

ప్రతి నెల రెక్కాడితే గాని డొక్కాడని కుటుంబాల కోసం వారికి మూడు పూటల తిండి అందించాలనే సదుద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టినదే ప్రజా పంపిణీ వ్యవస్థ. అయితే దీని కొందరు దుర్వినియోగం చేస్తున్నారు... మరికొందరు మోసాలు చేస్తూ.. ఒకవైపు ప్రభుత్వాని మోసం చేస్తూ మరోవైపు పేద ప్రజల పొటకొడుతున్నారు. వివరాలోకి వెళ్లితే.. జిల్లాలోని ఆలూరు ఎంఎల్ఎస్ పాయింట్‌లో భారీగా అవకతవకలు చోటుచేసుకుంటున్నాయి. బాధ్యత రహితంగా పని చేయవలసిన ఎంఎల్ఎస్ పాయింట్ ఇంచార్జ్ శ్రీదేవి జిల్లా ఓ అధికారిని అందదండాలతో అక్రమాలకు పాల్పడుతోంది. మండల కేంద్రాలకు, గ్రామాలకు సరఫరా చేస్తున్న బియ్యాన్ని తూకంలో మోసం చేస్తూ డీలర్లను బురిడీ కొట్టిస్తున్నారు. అంతేకాకుండా కార్డు దారులకు సరసమైన తూకాలు అందకుండా ఉండటానికి తానే కారణమైంది. ఆలూరు స్టాక్ పాయింట్ హమాలీలు లోడింగ్, అన్లోడింగ్ చేయ వలసి ఉన్నప్పటికీ అక్కడ లోడింగ్ చేయించి మీరు అన్లోడింగ్ చేయించుకోండి.. సదరు పైకము నేను చెల్లిస్తానని డీలర్ల దగ్గర నమ్మబలికి రెండు నెలలుగా డీలర్లకు అన్లోడింగ్ కూలీ చార్జీలు ఇవ్వడం లేదు. ఇదిగో అదిగో అని కాలయాపన చేస్తుందని డీలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలోనూ ఈ అధికారి అవినీతి ఆరోపణలు ఎదుర్కొని సస్పెండ్ అయినట్లు సమాచారం. సివిల్ సప్లై స్టాక్ పాయింట్ ద్వారా ప్రతినెల 53,717 మంది కాటుదారులకు 820 మెట్రిక్ టన్నుల బియ్యం, 46 మెట్రిక్ టన్నుల కందిబేళ్లు, 26 మెట్రిక్ టన్నుల పంచదార సరఫరా జరుగుతోంది. సివిల్ సప్లై స్టాక్ పాయింట్ నుండి తూకం లేకుండా సంచి ప్రకారం సప్లై చేసే బియ్యంలో బస్తా ఒకటి నుండి 10 కేజీల వరకు తరుగు వస్తున్నట్లు డీలర్లు పేర్కొంటున్నారు. అయితే తూకం వేసి సరుకులు ప్రతినెల నిత్యవసర సరుకులు పంపిణీ చేయాలని ప్రభుత్వ అధికారులు న్యాయాలయాలు గట్టిగా ఆదేశాలు జారీ చేసినప్పటికీ సదరు ఆదేశాలను బేకాతరు చేస్తూ తనకు ఇష్టం వచ్చినట్లు అధికారి వ్యవహరిం చడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఆలూరు సివిల్ సప్లై స్టాక్ పాయింట్ ద్వారా ఆలూరు, హోళగుంద, చిప్పగిరి, హాలహర్వి నాలుగు మండలాలకు సరఫరా జరుగుతోంది. 50 కిలోల బియ్యం సంచి నుంచి ఐదు కిలోలు కాదు కదా కేవలం రెండు కిలోల బియ్యం కోతకు గురైతే 328 కింటల్ బియ్యం పక్కదారి పట్టి క్వింటాంకు వెయ్యి రూపాయలు చొప్పున లెక్కేస్తే దాదాపు రూ.3 లక్షల ఇరవై ఎనిమిది వేలు పేద ప్రజల సొమ్ము అవినీతి అధికారుల జేబులోకి వెళుతూ పక్కదారి పడుతున్నట్లు తేటతెల్లమవుతుంది.


తహసిల్దార్ సమక్షంలో కార్యాలయం ముందు తూకం వేస్తున్న దృశ్యం

డీలర్లు ఎండియు ఆపరేటర్ల మధ్య రగడ

రేషన్ బియ్యాన్ని ఆలూరు స్టాక్ పాయింట్ తూకాల్లో మోసం చేస్తూ కోత విధించడం వల్ల డీలర్లు ఎండియు ఆపరేటర్ల మధ్య ప్రతినెల రగడ జరుగుతోంది. లింగప్ప అనే డీలర్ దగ్గర ఎండియూ ఆపరేటర్ ఇలియాజ్ 50 కేజీల బస్తాలు ఇవ్వాల్సి ఉంది. 33-40 కేజీలు ఎలా ఇస్తావ్ అంటూ నిలదీయగా ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి ఇంత తక్కువగా ఉన్న సంచులు తనకు పంపించారని డీలర్ ఆవేదన వ్యక్తం చేశాడు. సదరు బస్తాలను హోళగుంద తహశీల్దార్ కార్యాలయం ముందు బహిరంగంగా తూకం వేయగా ఒక బస్తా 33 కేజీలు రాగా మరో బస్తా 40 కేజీలు వచ్చింది. దీంతో స్థానిక తహశీల్దార్‌కు, జిల్లా అధికారానికి ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశారు. అయినా ఇంతవరకు స్పందించకపోవడం వెనుక పలు విమర్శలకు తావిస్తోంది.


ఎంఎల్ఎస్ నుంచి వచ్చిన 35 కేజీల బియ్యం బస్తాలు

తూకం అడిగే డీలర్లే టార్గెట్

ఎంఎల్ఎస్ పాయింట్ ఇంచార్జికి నాలుగు మండలాల్లో ఏ డీలర్ తూకం అడిగితే ఆ నెల ఆ డీలరే టార్గెట్. జిల్లా మెట్రోలజీ అధికారులు వెయిటింగ్ మిషన్ ద్వారా ఎటువంటి అవినీతికి పాల్పడకుండా సీలు వేసిన ఆమె చేతుల్లో వెయిటింగ్ మిషన్ టెక్నీషియన్లు ఉంటారు. వారితో ఆమెకు తూకం అనుకూలంగా మంచుకుంటుందని డీలర్లు పేర్కొంటున్నారు. డీలర్ ఎప్పుడు వెళ్లి అడిగితే అప్పుడు సరుకులు ఇవ్వాలి కానీ ఎంఎల్ఎస్ పాయింట్ ఇంచార్జ్ అలా ఇవ్వకుండా వారికి ఒక డేట్ ఇస్తుంది. ఆ డేట్‌లో అన్ని అక్రమాలు జరిగి పోవాల్సిందే.

ఆలూరు స్టాక్ పాయింట్ పై నిఘా

అక్రమాలను అరికట్టేందుకు ప్రభుత్వం చేతిలో అనేక అవినీతి నిర్మూలన సంస్థలు ఉన్నప్పటికీ అక్రమాలు జరుగుతున్నాయని విమర్శలు వినిపిస్తున్నాయి. విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ శాఖ అధికారులు స్టాక్ పాయింట్ తూకాల్లో జరిగే అక్రమాలపై విచారణ చేపడితే అవినీతి బయట పడుతుందని ప్రజల బహిరంగంగా చర్చించుకు ఒంటున్నారు. మోసాలకు పాల్పడుతున్న ఎంఎల్ఎస్ పాయింట్ ఇంచార్జ్‌పై ఉన్నాతాధికారులు పూర్తిగా విచారణ చేసి అడ్డుకట్ట వెయ్యకపోతే అవినీతి మరింత పెరిగే అవకాశం ఉంది. డీలర్లతోపాటు నిరుపేద కుటుంబాల కార్డుదారులు ఆమె చేతిలో బలి కావాల్సిందే. చర్యలు తీసుకుంటారా లేక కాలం వెళ్ళబుస్తారా వేచి చూడాలని నాలుగు మండలాల ప్రజలు చర్చించుకుంటున్నారు.





15న ధర్నాను జయప్రదం చేయండి : వ్యకాస

ప్రజాశక్తి - ఆత్మకూరు

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 15న నంద్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు జరిగే ధర్నాలో ఉపాధి కూలీలంతా పాల్గొని జయప్రదం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.నాగేశ్వర రావు కోరారు. బుధవారం మిడుతూరు మండలం చింతపల్లి గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించి కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకాన్ని నీరుగారిచేందుకు కేంద్రం 2023-24 బడ్జెట్ కేటాయింపుల్లో భారీ కోత విధించిందన్నారు. 60 వేల కోట్లు మాత్రమే కేటాయించిందన్నారు. 2023 జనవరి 1 నుంచి నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం యాప్ ద్వారా హాజరును తప్పనిసరి చేయాలని ఆదేశించడంతో సర్వర్ ప్రాబ్లం వల్ల హాజరు ఆన్లైన్ కాకపోతే కూలీలు నష్టపోయే అవకాశం ఉందన్నారు. కూలీలు పనిచేసే చోట టెంటు, మెడికల్, మజ్జిగ, మంచినీళ్లు, రవాణ చార్జీ లాంటివి అన్ని రద్దు చేసిందన్నారు. 200 రోజులు పనులు కల్పిస్తూ 600 రూపాయలు వేతనం ఇవ్వాలని, పని కోరే వారందరికీ పని కల్పిస్తూ పట్టణాలలో ఉపాధి హామీ కల్పించాలన్నారు. కార్యక్రమంలో వ్యకాసం జిల్లా సహాయ కార్యదర్శి పి పకీర్ సాహెబ్, జిల్లా నాయకులు టి.ఓబులేష్, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పి వెంకటేశ్వర్లు, మండల నాయకులు రామకృష్ణ, సిఐటియు పట్టణ కార్యదర్శి గోపాలకృష్ణ, మండల నాయకులు లింగస్వామి, చిన్న స్వాములు, రమణ, శివుడు, శేఖర్, రాములమ్మ, శేషమ్మ, ప్రశాంతి, లక్ష్మీదేవి, విక్టోరమ్మ, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు ఎం.నాగేశ్వరరావు

కుక్కల దాడిలో 75 గొర్రె పిల్లలు మృతి

- రూ. 4 లక్షలు నష్టం

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

గొర్రెల పెంపకమే జీవనాధారంగా జీవనం సాగిస్తున్న బత్తుల నడిపి వెంకటసుబ్బయ్య యాదవ్, బొడ్డు పోయిన గుర్రప్ప యాదవ్‌లకు చెందిన 75 గొర్రె పిల్లలు కుక్కల దాడిలో మంగళవారం రాత్రి మృతి చెందాయి.. దీంతో సుమారు నాలుగు లక్షల రూపాయలు నష్టం వాటిల్లింది. ఇందుకు సంబంధించిన వివరాలు.. దొర్నిపాడు గ్రామానికి చెందిన గుర్రప్ప యాదవ్, నడిపి వెంకటసుబ్బయ్య యాదవ్‌లు గొర్రెలను పెంచడమే వారి జీవనాధారం.. దినచర్యలో భాగంగానే వారు గొర్రెలను మేపుకుంటూ మంగళవారం రాత్రి 7 గంటల సమయానికి గొర్రెపిల్లలు ఉన్న చోటకు చేరుకునేసరికి అక్కడ ఏర్పాటు చేసిన కంచేలోకి ఒక్కసారిగా ఐదారు కుక్కలు వెళ్లి దాడి చేసి సుమారు 160 గొర్రె పిల్లలను గాయపరిచాయి. అందులో 75 గొర్రె పిల్లలు మృతి చెందినట్లు గొర్రెల యజమానులు తెలిపారు. కుక్కల కాట్లకు గురైన గొర్రె పిల్లలకు పశువైద్యాధికారులు చికిత్సలు చేశారు. గొర్రె పిల్లలు కుక్కల దాడిలో చనిపోయిన సమాచారాన్ని సంబంధిత తాసిల్దార్, విఆర్వో, పశు వైద్యాధి కారులకు తెలియజేసినట్లు గొర్రెల యజమానులు తెలిపారు. వెంటనే వారు సంఘటనా స్థలానికి చేరుకొని చనిపోయిన గొర్రె పిల్లలను పరిశీలించారు. ఆళ్లగడ్డ పశువర్ధక శాఖ సహాయ సంచాలకులు కొండారెడ్డి, దొర్నిపాడు పశువైద్యాధికారిని హరితలు మాట్లాడుతూ చనిపోయిన గొర్రె పిల్లలకు శవ పరీక్షలు నిర్వహించి నివేదికలను తయారు చేసి ఉన్నతాధికారులకు పంపుతున్నట్లు వారు తెలిపారు. ప్రభుత్వం నుండి ఆర్థిక సహాయం అందేలా నివేదికలు పంపుతామన్నారు. బాధితులు మాట్లాడుతూ ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది ఏహెచ్‌ఏ మనోజ్ఞ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పాలీసెట్ ఎంట్రెన్స్ పరీక్ష

ప్రజాశక్తి - బేతంచెర్ల

బేతంచెర్లలోని శేషారెడ్డి ఉన్నత పాఠశాల, సెంటెన్స్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో బుధవారం జరిగిన పాలీసెట్ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఈ పాలీసెట్ పరీక్షకు రెండు సెంటర్లలో సెంటెన్స్ స్కూల్‌లో 160 మందికి గాను 138 మంది, అలాగే శేషారెడ్డి హైస్కూల్‌లో 300 మందికి గాను 272 మంది విద్యార్థులు హాజరైనట్లు ఓఎస్‌డి.ఎంపీ. రాజేష్ తెలిపారు. నంద్యాల జిల్లా అబ్జర్వర్ బి.వెంకటేశ్వర్లు, బేతంచర్ల స్పెషల్ అబ్జర్వర్ సిహెచ్ సంజీవ రాయుడు, కెవిఎస్ఆర్ వరప్రసాద్‌లను కేంద్రాలను తనిఖీ చేశారు. ఓఎస్‌డి రాజేష్, అసిస్టెంట్ కోఆర్డినేటర్ ఏ.శేఖర్ మాట్లాడుతూ పాలీసెట్ పరీక్ష ఫలితాలు ఈ నెల 25వ తేదీ నుండి 30వ తేదీ లోపల వెలువడే అవకాశం ఉందని తెలిపారు.

1902కి వచ్చే ఫిర్యాదులకు అత్యంత ప్రాధాన్యత : కలెక్టర్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ప్రజా విజ్ఞప్తులను సంతృప్తికర స్థాయిలో పరిష్కరించడమే 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమ ప్రధాన లక్ష్యమని, 1902కు వచ్చే ఫిర్యాదులకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చి పరిష్కరించనున్నట్లు జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ వెల్లడించారు. బుధవారం కలెక్టర్ ఛాంబర్‌లో జగనన్నకు చెబుదాం అనే కార్యక్రమంపై విలేకరులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. స్పందన దరఖాస్తుల పరిష్కారంపై ప్రజల సంతృప్తి స్థాయి పర్యవేక్షణ కోసం జిల్లా, మండల స్థాయి పిఎంయు యూనిట్‌లు ఏర్పాటు చేశామన్నారు. 1902కి వచ్చే ఫిర్యాదుల విషయంలో అత్యంత శ్రద్ధ చూపాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చామన్నారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందిస్తామన్నారు. అర్జీల ద్వారా పరిష్కారానికి సాధ్యం కాని సమస్యలను 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం ద్వారా 1902 టోల్ ఫ్రీ నెంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేసి వేగవంతమైన, నాణ్యమైన పరిష్కారాన్ని పొందవచ్చన్నారు. స్పందన కార్యక్రమం ప్రత్యక్ష పర్యవేక్షణ కోసం జిల్లాకు ప్రత్యేకంగా సీనియర్ ఐఏఎస్ అధికారిని నియమించారని, జిల్లాలో పర్యటించి ఈ కార్యక్రమం అమలు తీరును పరిశీలిస్తారని తెలిపారు. డివిజన్ స్థాయిలో అందే ప్రజా ఫిర్యాదులను పరిష్కరించేందుకు జిల్లాలోని అన్ని రెవెన్యూ డివిజన్ పరిధిలో ఒక పీఎంయును ఏర్పాటు చేసి ఒక నోడల్ అధికారిని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇందులో ముఖ్యంగా రెవెన్యూ, పంచాయతీ రాజ్, వైద్య ఆరోగ్యం, హోమ్ శాఖ, వ్యవసాయ శాఖల అధికారులు సభ్యులుగా వ్యవహరిస్తారన్నారు. ఈ యూనిట్ నిరంతరాయ పర్యవేక్షణ ద్వారా ఒకే సమస్యకు వివిధ శాఖల అధికారుల ప్రమేయంతో పరిష్కార మార్గం దొరుకుతుందని తెలిపారు.

పక్కాగా కంటి వెలుగు కార్యక్రమం

- హైరిస్క్ గర్భిణీలకు వైద్య సేవలందించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జిల్లాలో కంటి వెలుగు కార్యక్రమాన్ని పక్కాగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ వైద్యాధికారులను ఆదేశించారు. బుధవారం నంద్యాల జిల్లా కేంద్రంలో జిల్లా కలెక్టర్ జిల్లాలో ఉన్న పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, వైద్యాధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కంటివెలుగు కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు పరచాలని, డైలీ రిపోర్ట్‌ను సమర్పించాలని ఆదేశించారు. హైరిస్క్ ఉన్న గర్భిణీ స్త్రీలను గుర్తించి ఉన్నత ఆసుపత్రులకు రెఫర్ చేయాలన్నారు. సచివాలయ ఆరోగ్య కార్యకర్తల నుండి ఆరోగ్య శ్రీ ఫీడ్ బ్యాక్ తీసుకొని మానిటర్ చేయాలన్నారు. సిఐసి, ఏఎంపి హెచ్‌సిలలో సాధారణ కాన్పులు ఇంప్రూవ్ చేయాలన్నారు. ఆరోగ్య కేంద్రాల్లో పోస్టులు ఖాళీలుంటే 20వ తేది లోపల భర్తీ చేసుకోవాలని డిఎంహెచ్‌ఒకు సూచించారు. ఎఫ్ఆర్ఎస్ హాజరు 100 శాతం ఉండాలన్నారు. అనీమియా టెస్టింగ్ శాంపిల్ రిజిస్టర్‌ను రెగ్యులర్‌గా మానిటర్ చేయాలని ఆదేశించారు. కొలిమిగుండ్ల, శ్రీశైలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఎన్సీడీ సీడీ సర్వేను ఇంప్రూవ్ చేయాలన్నారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ఆర్. వెంకటరమణ, ప్రోగ్రాం అధికారులు, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



జూమ్ మీటింగ్ ద్వారా పిహెచ్‌సిల మెడికల్ ఆఫీసర్లతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

1200 మైలురాయికి యువగళం

- నందికొట్కూరు నియోజకవర్గంలో హోరెత్తిన పాదయాత్ర

ప్రజాశక్తి - నందికొట్కూరు

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పాదయాత్ర బుధవారం నందికొట్కూరు నియోజకవర్గం అల్లూరులో 1200 కిలో మీటర్ల మైలురాయిని చేరుకుంది. ఈ సందర్భంగా హంద్రీనీవా నుంచి మిడుతూరు ఎత్తిపోతల పథకానికి లోకేష్ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నారా లోకేష్ మాట్లాడుతూ ఈ ఎత్తిపోతల పథకం ద్వారా మిడుతూరు, కలమందలపాడు, మాదిగుండం, పారమంచాల చెరువులకు నీరు చేరుతుందన్నారు. తద్వారా 22 వేల ఎకరాలకు సాగునీరు, మిడుతూరు, జూపాడుబంగ్లా మండలాల్లో 60వేలమంది ప్రజలకు తాగునీరు అందుతుందన్నారు. 95వ రోజు యువగళం పాదయాత్ర నందికొట్కూరు నియోజకవర్గంలో హోరెత్తింది. దారిపొడవునా జనం యువనేతకు ఎదురెళ్లి స్వాగతం పలికారు. వివిధ గ్రామాల ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలను యువనేతకు విన్నవించారు. మరో ఏడాదిలో రాబోయే చంద్రన్న ప్రభుత్వం మీ అందరి సమస్యలకు పరిష్కారం చూపుతుందని చెప్పి, ముందుకు సాగారు. గార్గేయపురం క్యాంప్ సైట్ నుంచి ప్రారంభమైన యువగళం పాదయాత్రకు అడుగడుగునా జనం నీరాజనాలు పలికారు. బ్రాహ్మణకొట్కూరు, కోళ్ల బావాపురం, వడ్డెమూరు, కోనేటమ్మపల్లి, అల్లూరు మీదుగా యువనేత లోకేష్ నందికొట్కూరుకు చేరుకున్నారు. పాదయాత్ర దారిలో ఎస్సీలు, ఎస్టీలు, బోయలు, గౌడలు, సర్పంచ్‌లు యువనేతను కలిసి తమ సమస్యలు చెప్పుకున్నారు. నందికొట్కూరు ఎస్ఎస్ ఫంక్షన్ హాలు వద్ద నిర్వహించిన బహిరంగసభకు నియోజకవర్గం నలుమూలల నుంచి ప్రజలు పెద్దఎత్తున హాజరయ్యారు. 95వ రోజు యువనేత లోకేష్ 17.9 కిలో మీటర్ల దూరం నడిచారు. ఇప్పటి వరకు యువగళం పాదయత్ర 1206.9 కిలోమీటర్లు పూర్తయింది.

ఎమ్మెల్యేనే రోడెక్కి పోరాడాల్సిన పరిస్థితి

నందికొట్కూరు ఎమ్మెల్యేనే రోడెక్కి హక్కుల కోసం పోరాడాల్సిన పరిస్థితి ఏర్పడిందని నారా లోకేష్ పేర్కొన్నారు. నందికొట్కూరు బహిరంగ సభలో లోకేష్ మాట్లాడుతూ ఆర్డర్‌కు ఆర్డర్ వేసే అధికారాలు లేవన్నారు. జగన్ పాలనలో దళితులకు జరుగుతున్న అవమానం చూడాలి అంటే నందికొట్కూరు రావాలన్నారు. నందికొట్కూరుని వైసిపి నాయకులు భూకబ్జాలకు, అక్రమ మద్యానికి ల్యాండ్ సెటిల్మెంట్స్‌కి అడ్డాగా మార్చేసారన్నారు. నందికొట్కూరులో ఉన్న ఎన్టీఆర్ జలాశయాన్ని వైసిపి నేతలు కబ్జా చేసారన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే నందికొట్కూరు పట్టణంలో కేజీ రోడ్డు విస్తరణలో ఇళ్లు, భవనాలు, దుకాణాలు కోల్పోయే బాధితులకు నష్టపరిహారం అందిస్తామని హామీ ఇచ్చారు. మొక్కజొన్న రైతుల్ని ఆదుకుంటామని, అవసరమైన కొనుగోలు కేంద్రాలు, గౌడౌన్స్ ఏర్పాటు చేసి గిట్టుబాటు ధర కల్పిస్తామని హామీ ఇచ్చారు. పాదయాత్రలో మాజీ మంత్రి భూమా అఖిల ప్రియ, టిడిపి జిల్లా అధ్యక్షులు గౌరు వెంకటరెడ్డి, ఎమ్మెల్సీ బిటి.నాయుడు, నియోజకవర్గ ఇన్చార్జి మాండ్ర శివానందరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గౌరు చరిత, బిసి జనార్ధన్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



1200 మైలురాయి వద్ద లోకేష్‌కు స్వాగతం పలుకుతున్న నాయకులు

బహిరంగ సభలో మాట్లాడుతున్న నారా లోకేష్





మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోగురు ఆర్థర్

లోకేష్ వ్యాఖ్యలు సరైనవి కావు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - నందికొట్కూరు

యువగళం పాదయాత్రలో భాగంగా నందికొట్కూరు పట్టణంలోని స్థానిక ఎస్ఎస్ ఫంక్షన్ హాల్ పక్కన ఏర్పాటు చేసిన బహిరంగ సభలో నారా లోకేష్ రాష్ట్ర సిఎం జగన్‌ను సైకో అంటూ, ఎమ్మెల్యేకు ఏ అధికారి మాట వినడం లేదంటూ చేసిన వ్యాఖ్యలను ఎమ్మెల్యే తోగూరు అర్థర్ తీవ్రంగా ఖండించారు. బుధవారం పట్టణంలోని స్థానిక వైసిపి కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజవర్గాన్ని అభివీద్ధి చేసింది నాడు టిడిపి ప్రభుత్వమని నారా లోకేష్ మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. నేటి వైసిపి పాలనలో సిఎం జగన్ మోహన్ రెడ్డి నియోజవర్గ అభివృద్ధి కోసం కోట్ల రూపాయలు మంజూరు చేశారని తెలిపారు. నియోజవర్గంలో దళిత ఎమ్మెల్యేకు ఏ అధికారి మాట వినడం లేదంటూ మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. నియోజవర్గంలో 86 సచివాలయాల్లో అభివద్ధి పనులు జరిగాయని అవి టిడిపి నాయకులకు కనబడడం లేదంటూ ఎద్దేవా చేశారు. సిఎం జగన్ నాయకత్వంలో బడుగు బలహీన వర్గాల ఎమ్మెల్యేలకు ఉన్నంత స్వేచ్ఛ ఎక్కడా లేదన్నారు. నందికొట్కూరులో కబ్జాలకు పాల్పడ్డారని చేసిన ఆరోపణ సరైంది కాదన్నారు. సమావేశంలో కౌన్సిలర్లు జాకీర్ హుస్సేన్, ఉండవల్లి ధర్మరెడ్డి, సింగల్ విండో చైర్మన్ సగినేలా హుస్సేనయ్య, పైపాలెం షేక్ ఇనయతుల్లా, నాయకులు జాన్, మహిళా నాయకురాలు డాక్టర్ వనజ తదితరులు పాల్గొన్నారు

విద్యుత్ షాక్‌తో కాంట్రాక్టు ఉద్యోగికి గాయాలు

ప్రజాశక్తి - కోవెలకుంట్ల

పట్టణంలోని స్థానిక సంత మార్కెట్‌లో కాంట్రాక్టు ఉద్యోగి బుధవారం సాయంత్రం కరెంటు స్తంభం ఎక్కి పని చేస్తుండగా ఒకసారిగా కరెంటు పాస్ కావడంతో షాక్ తగిలి కిందపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు.. పట్టణంలో పాండురంగ స్వామి తిరుణాల సందర్భంగా రథోత్సవం జరిగింది. బుధవారం మైల తిరుణాల కావడంతో రథోత్సవం జరిగిన తర్వాత కరెంటు తీగలను సరి చేయాల్సి ఉంది. అందులో భాగంగానే కాంట్రాక్టు ఉద్యోగి నరసింహారెడ్డి కరెంటు స్తంభం ఎక్కి పని చేస్తుండగా కరెంట్ పాస్ కావడంతో షాక్ కొట్టి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతడిని స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం నంద్యాల వైద్యశాలకు తరలించారు.

ట్రూఅప్ ఛార్జీలు రద్దు చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - ఆత్మకూర్

విద్యుత్ ఛార్జీలను పెంచలేదని ఒకవైపున నోటిఫికేషన్ జారీ చేస్తూ, మరోవైపు సర్దుబాటు చార్జీల పేరుతో దొడ్డిదారిన భారాలు వేయడం మోసపూరితమని, 2023 ఏప్రిల్ నుండి ప్రతినెల విద్యుత్ యూనిట్‌కు 40 పైసల చొప్పున అదనంగా సర్దుబాటు చార్జీలు (ట్రూఅప్) వసూలు చేయడాన్ని వెంటనే ఉపసంహరించు కోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి. యేసురత్నం, పట్టణ కార్యదర్శి ఏ.రణధీర్‌లు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక కార్యాలయంలో వారు మాట్లాడుతూ ప్రతి నెల వసూలు చేయడమే కాకుండా మళ్లీ సంవత్సరాంతంలో అవసరమైతే అదనంగా సర్దుబాటు భారం మోపే ప్రమాదం కూడా ఉందన్నారు. గత సంవత్సరం రాష్ట్ర ప్రభుత్వం 1400 కోట్ల రూపాయలు విద్యుత్ ఛార్జీలు పెంచి భారం మోపిందని, 2014-19 మధ్య వినియోగించుకున్న విద్యుత్‌కు ఇప్పుడు 36 నెలల పాటు యూనిట్‌కు 25 పైసలు చొప్పున వసూలు చేస్తున్నారని తెలిపారు. దీని వలన 2900 కోట్ల రూపాయల భారం పడుతుందని చెప్పారు. 2020-21లో వినియోగించుకున్న విద్యుత్‌పై యూనిట్‌కు 65 పైసలు వరకు 2023 ఏప్రిల్ నుండి అదనంగా వసూళ్లకు ఆదేశాలు ఇచ్చారన్నారు. ఈ పేరుతో 3083 కోట్ల రూపాయల భారం వినియోగదారులపై పడనున్నది. మళ్లీ స్మార్ట్ మీటర్లు పెట్టి ఆ వ్యయాన్ని నెలవారీగా ప్రజలపై వేయటానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. బడా కార్పొరేట్ కంపెనీల నుండి విద్యుత్ అధిక రేట్లకు కొనుగోలు చేస్తూ ఆ భారాన్ని ప్రజలపై మోపుతున్నారని చెప్పారు. అదాని తదితర కార్పొరేట్ కంపెనీలకు మేలు చేసే రీతిలో బొగ్గు అధిక రేట్లకు కొనుగోలు చేసి సర్దుబాటు చార్జీల పేరుతో దండుకుంటున్నారు. వివిధ రకాల మెడిసిన్స్‌పై, టోల్గేట్స్‌పై, డిజిటల్ సేవలపై యూజర్ చార్జీల పేరుతో భారాలు వేయడాన్ని ప్రజలు ప్రతిఘటించాలన్నారు. సమావేశంలో సిపిఎం పట్టణ నాయకులు మంజుల, మీనాక్షమ్మ, ఎన్.స్వాములు, ఏ.సురేంద్ర, డి.రామ్ నాయక్, సద్దాం హుసేన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు వి యేసు రత్నం



మాట్లాడుతున్న మాజీ మంత్రి కొల్లు రవీంద్ర

బిసిల అభ్యున్నతి టిడిపితోనే సాధ్యం

- మాజీ మంత్రి కొల్లు రవీంద్ర

ప్రజాశక్తి - నందికొట్కూరు

రాష్ట్రంలో అత్యధిక జనాభా గలిగిన బిసి సామజిక వర్గ ప్రజలకు న్యాయం చేసేది, వారి అభివృద్ధికి కృషి చేసే పార్టీ టిడిపి అని, బిసిల అభ్యున్నతి చంద్రబాబు పాలనతోనే సాధ్యమని మాజీ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. బుధవారం పట్టణంలోని బిసి సంఘం జిల్లా అధ్యక్షులు కురుమూర్తి గృహంలో జాతీయ బిసి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసిపి పాలనలో బడుగు బలహీన వర్గాలపై రాష్ట్రంలో దాడులు విపరీతంగా పెరిగాయని, అక్రమ కేసులు బనాయిస్తున్నారని చెప్పారు. ఇది తగదని వారు హెచ్చరించారు. రాష్ట్రంలో బిసిల అభ్యున్నతికి పాటుపడిన ఏకైక పాలన నాయకుడు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఒక్కడేనన్నారు. బడుగు బలహీన వర్గాల ప్రజల అభివృద్ధి చెందాలంటే టిడిపిని ఆదరించాలని, చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రిగా చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జాతీయ బిసి సంఘం జిల్లా నాయకులు, పట్టణ నాయకులు పాల్గొన్నారు.

ఆర్‌బికెలను సద్వినియోగం చేసుకోవాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - చాగలమర్రి

సచివాలయ పరధిలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆళ్ళగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని పెద్దబోధనంలో రూ.21.8 లక్షలతో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలు రైతులకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. అనంతరం గ్రామంలో ఆంజనేయ ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి బాబులాల్, మండల కన్వీనర్ కుమార్ రెడ్డి,ఎంపీపీ రామిశెట్టి వీరభద్రుడు, జడ్‌పిటిసి లక్ష్మిదేవి, సర్పంచులు శివమ్మ,యామా నరసమ్మ, ప్రతాప్‌రెడ్డి,బంగారు షరీఫ్, గోవిందయ్య, ఎంపిటిసిలు నరసింహులు, పత్తి నారాయణ, లక్ష్మిరెడ్డి, సింగల్ విండో అధ్యక్షుడు దస్తగిరి, వైసిపి నాయకులు రమణారెడ్డి, వెంకట్రామిరెడ్డి, చిన్ననాయుడు, సంజీవరెడ్డి, మస్తాన్ రెడ్డి, నరసింహారెడ్డి, ఓబులరెడ్డి, బాలక్రిష్టా రెడ్డి, నారాయణరెడ్డి, శేషురమేష్, డిఈ నరసింహులు, ఎంపీడీవో భాగ్యలక్ష్మి, డిటి శ్రీనివాసులరెడ్డి, ఏఓ రంగ నేతాజీ, ఏఈలు కొండారెడ్డి, జగ్గయ్య, షఫివుల్లా, షాజహాన్, పంచాయతీ కార్యదర్శి సబియా, విఆర్‌ఓ వెంకటరామిరెడ్డి, సచివాలయ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఆర్‌బికెను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

పేదల సంక్షేమమే ధ్యేయం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బండి ఆత్మకూరు

పేదల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం పని చేస్తుందని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని వానపల్లి గ్రామంలో సర్పంచి షేక్ షబ్బీర్ అహ్మద్, యువ నాయకుడు కడిపి రెడ్డి దిలీప్ కుమార్ రెడ్డి, ఉప సర్పంచ్ రామలింగేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి ఇంటి వద్దకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో వైసిపి శ్రీశైలం నియోజకవర్గం సమన్వయకర్త శిల్ప భువనేశ్వర్ రెడ్డి, మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు చిన్న సంజీవరెడ్డి, మాజీ ఎంపీపీ దేశ వెంకటరామిరెడ్డి, కాకునూరు సర్పంచ్ మహేశ్వర్ రెడ్డి, భోధనం సర్పంచ్ సుబ్బారెడ్డి, భాస్కర్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సంక్షేమ పథకాలను గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే శిల్పా

27, 28న డబుల్స్ షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్

ప్రజాశక్తి-డోన్

డోన్‌లో ఈ నెల 27, 28న బుగ్గన శేషారెడ్డి మెమోరియల్ ఇండోర్ స్టేడియంలో కర్నూల్, నంద్యాల జిల్లాల పురుషుల డబుల్స్ షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ శుభం విల్లా హోమ్స్ డెవలపర్స్ మేనేజింగ్ పార్టనర్స్ అర్జున్ రెడ్డి, కొంగటి ప్రశాంత్ డోన్ వారి సౌజన్యంతో ఈ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని చెప్పారు. మొత్తం మూడు విభాగాల్లో ఈ టోర్నీ జరుగుతుందని ఓపెన్ క్యాటగిరి, 30 నుండి 40 సంవత్సరాల క్యాటగిరి, 40 సంవత్సరాల పై బడిన క్యాటగిరిగా ఉంటాయని తెలిపారు. మొదటి స్థానంలో గెలిచిన వారికి 25 వేల నగదుతో పాటు ట్రోఫీ, రెండవ విజేతకు 12,500 రూపాయలు నగదుతో పాటు ట్రోఫీ, మూడవ స్థానంలో ఉన్న రెండు జట్లకు 7,500 రూపాయలు చొప్పున నగదు అందజేసి ట్రోఫీలు అందజేస్తారన్నారు. టోర్నమెంట్ స్పాన్సర్స్ ప్రశాంత్ కొంగటి, అర్జున్ రెడ్డిలు మాట్లాడుతూ టోర్నమెంట్ లో పాల్గొనే ప్రతి క్రీడాకారులకు ఉచితంగా జెర్సీ టీ షర్టులు, భోజనం, వసతి ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఈనెల 25వ తేదీ లోపు 9515951541 నెంబర్‌కు వాట్సాప్‌లో రూ.300 సభ్యత్వ రుసుం చెల్లించి పేర్లను నమోదు చేసుకోవాలని, తప్పనిసరిగా ప్రతి క్రీడాకారుడు ఆధార్ కార్డు తీసుకురావాలన్నారు. ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులుగా వెంకటరామ్, జాహీర్, అనార్ కరుణాకర్, సుమన్, ప్రేమ్, సిద్దారెడ్డి, జానకిరాముడు ఉంటారని తెలియజేశారు.



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, టోర్నమెంటు స్పాన్సర్స్ కొంగటి ప్రశాంత్, అర్జున్ రెడ్డి



నివాళ్లులర్పిస్తున్న నాయకులు

మాజీ జడ్పిటిసి సేవలు చిరస్మరణీయం : టిడిపి

ప్రజాశక్తి - బేతంచర్ల : బేతంచెర్ల మండల మాజీ జెడ్పిటిసి విజయభాస్కర్ రెడ్డి పార్టీకి చేసిన సేవలు చిరస్మరణీయమని టిడిపి మండల కన్వీనర్ పున్నమి ఎల్ల నాగయ్య, పట్టణ కార్యదర్శి షేక్షావలి చౌదరి, పోలూరి శ్రీనివాసరెడ్డిలు అన్నారు. మాజీ జెడ్పిటిసి పోలూరు విజయభాస్కర రెడ్డి వర్ధంతి సందర్భంగా బుధవారం స్థానిక టిడిపి కార్యాలయంలో పట్టణ కార్యదర్శి షేక్షావల్లి చౌదరి ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టిడిపి ఆవిర్భావం నుంచి బేతంచర్ల మండలంలో పార్టీ అభివృద్ధి కోసం ఎంతో కృషిన గొప్ప నాయకుడని కొనియాడారు. కార్యక్రమంలో పోలూరు శ్రీనివాస్ రెడ్డి, కాకర్ల తిరుమలేష్ చౌదరి, మేకల నాగరాజు, బుగ్గానపల్లి రమేష్, రామ్ గోపాల్ ,మలిపెద్ది నాగేశ్వర్ రెడ్డి, ముల్లా ,కుమ్మరి శ్రీనివాసులు, వంశీ, రాముడు, సిమెంట్ నగర్ రాముడు, ఉరుకుందు, వాసు, జీవన్ చౌదరి, మస్తాన్వలి, సయ్యద్, లోకేష్ గౌడ్, శివ, కానాల అంజి, సుమంత్, తిమ్మరాజు, అంజాద్ భాష, షబ్బీర్ వలీ తదితరులు పాల్గొన్నారు.

ఆర్.బుక్కాపురంలో జై భారత్ సామాజిక విప్లవభేరి

ప్రజాశక్తి - బేతంచెర్ల : బేతంచెర్ల మండలం ఆర్.బుక్కాపురం గ్రామంలో జై భారత్ సామాజిక విప్లవభేరి సభ ప్రధాన కార్యదర్శి గొల్లపల్లి గురవయ్య ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జై భారత్ సామాజిక విప్లవ రణభేరి రాష్ట్ర కార్యదర్శి నాగరాజు, గొల్లపల్లి గురువయ్య మాట్లాడుతూ సమాజంలోని జరుగుతున్న పరిస్థితులను బట్టి మతసామరస్యం, కుల నిర్మూలన, అవినీతి నిర్మూలన, అసమానతలు లేని సమాజం కోసం జై భారత్ సామాజిక విప్లవ రణ భేరి పని చేస్తుందని తెలిపారు. జ్యోతి, రాజశేఖర్, రాజగోపాల్, రాణమ్మ, మాధవ స్వామి, మధుశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సరిహద్దులు దాటుతున్న రేషన్ బియ్యం

ప్రజాశక్తి - వెలుగోడు : వెలుగోడు పట్టణానికి చెందిన ఖలీల్, మాలిక్‌లు బొరుగులు అమ్ముకుంటూ రేషన్ బియ్యాన్ని సేకరిస్తూ రాత్రికి రాత్రి లారీల్లో సరిహద్దులను దాటిస్తున్న వైనం వెలుగోడులో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే విజిలెన్స్ అధికారులకు సమాచారం అందడంతో బుధవారం తెల్లారిజామున సిఐ నాగరాజు ఆధ్వర్యంలో దాడులు చేశారు. ఈ దాడుల్లో 145 క్వింటాల్ల రేషన్ బియ్యం పట్టుకున్నారు. వెలుగోడు పట్టణంతో పాటు మండలంలో రేషన్ బియ్యం సేకరించి ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో ఈ దాడులు నిర్వహించినట్లు వారు తెలిపారు. స్థానిక హెచ్‌పి గ్యాస్ గోదాము వద్ద ఓ లారీ, ఓ ఈచర్ రేషన్ బియ్యంతో వెలుతున్నట్టు గమనించి పట్టుకున్నారు. రెండు వాహనాలను, బియ్యం తరలిస్తున్న ఇద్దరినీ అరెస్టు చేసినట్లు వారు వివరించారు.



పట్టుబడిన లారీ

సబ్సిడీపై జీలుగ విత్తనాలు : ఎఒ

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

మండలంలోని ఆయా గ్రామాలలో ఉన్న రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు సబ్సిడీతో జీలుగు విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి కిషోర్ రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలానికి 320 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు మంజూరు అయ్యాయన్నారు. విత్తనాలు కావలసిన రైతులు తమ పట్టాదార్ పాసుబుక, ఆధార్ జిరాక్స్ కాపీలతో రైతు భరోసా కేంద్రాలలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. 10 కేజీల బ్యాగు ధర రూ. 790 రూపాయలు కాగా 50 శాతం సబ్సిడీతో రూ.395 రైతు చెల్లిస్తే విత్తనాలు ఇస్తారన్నారు. ఒక ఎకరా రైతుకు ఒక్క బస్తా, గరిష్టంగా ఐదు ఎకరాల రైతుకు ఐదు బస్తాలు ఇవ్వనున్నట్లు తెలిపారు.

మొక్కజొన్న పంటను కొనుగోలు చేస్తాం : రైతుల నుంచి మొక్కజొన్న పంటను కొనుగోలు చేస్తామని ఆయన తెలిపారు. రైతులు మొక్కజొన్నలను అమ్ముకోవడానికి ఆయా రైతు భరోసా కేంద్రాలలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకుంటే రైతుల సెల్ ఫోన్‌లకు పూర్తి సమాచారం మెసేజ్ రూపంలో వస్తుందన్నారు. ప్రభుత్వం మొక్కజొన్నకు మద్దతు ధర రూ.1962గా నిర్ణయించిందని, రైతులందరూ ఖచ్చితంగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. **రుద్రవరం :** మండలంలోని ఆయా గ్రామాలలో ఉన్న రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు సబ్సిడీపై జీలుగు విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి బి జ్యోతి తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ మండలానికి 660 క్వింటాల జీలుగ విత్తనాలు మంజూరు అయ్యాయన్నారు. నేటి నుంచి ఆళ్లగడ్డ మార్కెట్ యార్డులో రైతుల నుంచి మొక్కజొన్న ధాన్యం కొనుగోలు చేస్తున్నట్లు ఆమె తెలిపారు. మండలానికి సంబంధించి 148 మంది రైతులు మొక్కజొన్నలను అమ్ముకోవడానికి ఆయా రైతు భరోసా కేంద్రాలలో రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. రైతులు తమ పంటను ఆళ్లగడ్డ మార్కెట్ యార్డులో అమ్ముకోవాలని తెలిపారు. **చాగలమర్రి :** మండలంలోని ఆయా గ్రామాలలో ఉన్న రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు సబ్సిడీతో జీలుగ విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి రంగ నేతాజి బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలానికి 280 క్వింటాల జీలుగు విత్తనాలు మంజూరు అయ్యాయి. ఈ నెల 11 నుంచి ఆళ్లగడ్డ మార్కెట్ యార్డులో రైతుల నుంచి మొక్కజొన్న విత్తనాలను కొనుగోలు చేస్తున్నట్లు వ్యవసాయ అధికారి రంగ నేతాజి తెలిపారు. మండలానికి సంబంధించి 65 మంది రైతులు మొక్కజొన్నలను అమ్ముకోవడానికి ఆయా రైతు భరోసా కేంద్రాలలో రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు.



మాట్లాడుతున్న ఎఒ కిషోర్ రెడ్డి

ఎస్ఎస్‌సి మండల టాపర్‌కు సన్మానం

ప్రజాశక్తి - చాగలమర్రి

చాగలమర్రిలోని జిల్లా పరిషత్ ఓరియంటల్ బాలికల ఉన్నత పాఠశాల నుండి పదవ తరగతి పరీక్షలలో మండల టాపర్‌గా నిలిచిన హిబా ముబశిరను చాగలమర్రి మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ తులసమ్మ, వైసిపి రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ బాబూలాల్‌ల. ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు. అలాగే ఈ పాఠశాల నుండి ఎస్ఎస్సిలో మంచి మార్కులు సాధించిన హేమలత, అయేషా సిద్దిక్‌లను ఘనంగా సన్మానించారు. ఈ ముగ్గురికి మెమొంటోలతో పాటు ఒక్కొక్కరికి రూ.2వేలు నగదును పారితోషికంగా అందజేశారు. ఈ సందర్భంగా షేక్ బాబూలాల్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివి రికార్డ్ స్థాయిలో మార్కులు సాధించి ప్రభుత్వ పాఠశాలలకు మంచి పేరు ప్రఖ్యాతలు తెచ్చిపెట్టారని అభినందించారు. ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, ఉపాధ్యాయుల కృషి వలనే ఈ ముగ్గురు విద్యార్థులు మంచి మార్కులు సాధించారని తెలిపారు. క్రమశిక్షణ పట్టుదలతో విద్యనభ్యసిస్తే కార్పొరేట్ విద్యాసంస్థలకు పోటీపడి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించవచ్చన్నారు. పాఠశాల అభివృద్ధికి, విద్యాభివృద్ధికి పాటుపడుతున్న హెచ్ఎం విజయలక్ష్మిని, విద్యా కమిటీ చైర్మన్ మహబూసున్నాను సన్మానించి ఉపాధ్యాయులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థిని హిబా ముబశిర 559 మార్కులు సాధించి ప్రభుత్వ పాఠశాలల్లో మండల స్థాయిలో ప్రథమంగా నిలిచిందని అభినందించారు. అలాగే హేమలత 537, ఆయేషా సిద్దిక 525 మార్కులు సాధించి రెండు, మూడో స్థానాన్ని కైవసం చేసుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ కుమార్ రెడ్డి, తెలుగు గంగ ఏఈ షేక్ సలీం, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు గణేష్ రెడ్డి, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ ముల్లా జాబిర్, జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ అబ్దుల్లా, వార్డు మెంబర్ పెయింటర్ షరీఫ్, వైసిపి నాయకులు గేట్ల మహబూబ్ సాబ్, ముల్లా ఖాదర్ బాషా, ముల్లా ఇబ్రహీం, షేక్ షబ్బీర్, జల్సా గౌస్, బబ్లు, ఖదీర్, లడ్డు భాష, రమణారెడ్డి, వెంకటేశ్వర రెడ్డి విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.



మెమెంటోలతో విద్యార్థినులను సత్కరిస్తున్న వైసిపి రాష్ట్ర మైనారిటీ నాయకుడు షేక్ బాబులాల్



నిరసన తెలుపుతున్న ఎఐటియుసి నాయకులు

బ్రిజూ భూషణ్ చరణ్ సింగ్‌ను తొలగించాలి : ఎఐటియుసి

ప్రజాశక్తి - నంద్యాల : దేశ రాజధానిలో రెజ్లింగ్ మహిళా క్రీడాకారుల పట్ల వేధింపులకు పాల్పడిన డబ్ల్యూఎఫ్ఐ అధ్యక్ష పదవి నుంచి బిజెపి ఎంపీ బ్రిజ్ భూషణ్ చరణ్ సింగ్‌ను తక్షణమే తొలగించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎఐటియుసి పట్టణ కార్యదర్శి డి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శాంతియుతంగా ఆందోళన చేస్తున్న రెజ్లింగ్ క్రీడాకారులపై పోలీసు యంత్రాంగం లాఠీ చార్జి చేయడానికి నిరసిస్తూ ఏఐటీయూసీ పట్టణ సమితి ఆధ్వర్యంలో స్థానిక ఎన్టీఆర్ కాంప్లెక్స్ వద్ద కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు కే ప్రసాద్, పట్టణ ప్రధాన కార్యదర్శి డి.శ్రీనివాసులు, ఎపి రైతు సంఘం జిల్లా కోకన్వీనర్ జి.సోమన్న, ఎపి మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు నారాయణమ్మ, ఏఐటియుసి పట్టణ అధ్యక్షుడు భూమని శ్రీనివాసులు మాట్లాడారు. రెజ్లింగ్ క్రీడాకారులకు ఏఐటీయూసీ నిరంతరం అండగా ఉంటుందని తెలిపారు. నాయకులు చంద్రశేఖర్. సుబ్బ రాయుడు. రామన్న. వెంకటేశ్వర్లు. హుసేని తదితరులు పాల్గొన్నారు.

సేవా దృక్పథంతో బ్యాంక్‌లు పని చేయాలి

- బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర బ్రాంచి ప్రారంభోత్సవంలో జాయింట్ కలెక్టర్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

వ్యాపార కోణంలో కాకుండా సేవా దృక్పథంతో ప్రజలకు రుణాలు మంజూరు చేసి వారి అభివృద్ధికి దోహదపడాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిశాంతి బ్యాంకు నిర్వాహకులకు సూచించారు. బుధవారం నంద్యాల పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఎమ్మెస్సార్ కాంప్లెక్స్‌లో బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర నంద్యాల బ్రాంచ్ బ్యాంకును, ఎటిఎం సెంటర్‌ను జోనల్ మేనేజర్ జిఎస్‌డి ప్రసాద్, బ్రాంచ్ మేనేజర్ వి. హరి క్రిష్ణలతో కలిసి జెసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ మహారాష్ట్ర బ్యాంకు సేవలు విస్తతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. బ్యాంక్ అఫ్ మహారాష్ట్ర 36వ బ్రాంచ్ ను నంద్యాల జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. బ్యాంక్ సేవలు విస్తరించడంతో పాటు అభివృద్ధి పథంలో నడవాలని ఆకాంక్షించారు. అనంతరం జోనల్ మేనేజర్ మాట్లాడుతూ విజయవాడ కేంద్రంగా ఎపిలో 36వ శాఖ ఏర్పాటు చేశామని, అందరికీ అనుకూలంగా ఉండే స్కీమ్‌లు అందుబాటులో ఉన్నాయన్నారు. వ్యాపారులకు, వ్యవసాయదారులకు, ఉద్యోగులకు పారిశ్రామిక వేత్తలకు అనుకూలంగా అవకాశాలు ఉంటాయన్నారు. ఇంకా ఏడు శాఖలు ప్రారంభించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ప్రతి జిల్లాలో రెండో శాఖ ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయన్నారు. 43 శాఖలతో బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర వృద్ధిలో ఉండబోతుందన్నారు. గత ఏడాది బ్యాంక్ అభివృద్ధి చూస్తే 4 లక్షల 9 వేల కోట్ల వ్యాపారంతో ముందుందన్నారు. 16,1600 కోట్లు నికర లాభంతో ముందుందన్నారు. కస్టమర్‌లకు అవసరం అనుకుంటే నంద్యాల పట్టణంలో మరో ఎటిఎంను ఏర్పాటు చేస్తామన్నారు. బ్రాంచ్ మేనేజర్ మాట్లాడుతూ ప్రజలకు హౌసింగ్ లోన్స్, రీటైల్ లోన్స్, రైస్ మిల్లులకు కోల్డ్ స్టోరేజ్‌ల ఏర్పాటుకు బిజినెస్ లోన్స్ ఇస్తామన్నారు. తక్కువ శాతంతో 84.0 నుండి హౌసింగ్ లోన్ ప్రారంభం అవుతుందన్నారు. మెడిసేవ అధినేత మల్లు రామచంద్రారెడ్డి, పరంజ్యోతి, పీరా, పలువురు సీనియర్ కస్టమర్‌లను జోనల్ మేనేజర్, బ్రాంచ్ మేనేజర్‌లు సన్మానించారు. కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది, కస్టమర్‌లు పాల్గొన్నారు.



బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర నూతన బ్రాంచ్ ను ప్రారంభిస్తున్న జిల్లా జాయింట్ కలెక్టర్ టి. నిశాంతి



మెడిసేవ అధినేత మల్లు రామ చంద్రారెడ్డి ని సన్మానిస్తున్న జోనల్ మేనేజర్, బ్రాంచ్ మేనేజర్

ఉపాధి పనుల వద్ద కొండచిలువ

- భయాందోళనకు గురైన కూలీలు

ప్రజాశక్తి - రుద్రవరం : మండలంలోని రెడ్డిపల్లి గ్రామ సమీపంలో జరుగుతున్న ఉపాధి పనుల వద్ద బుధవారం కొండచిలువ కనిపించడంతో కూలీలు భయాందోళనకు గురయ్యారు. గ్రామ సమీపంలోని వంకలో కూలీలు పనులు చేస్తుండగా పెద్ద కొండ చిలువ వారికి కనిపించింది. కొండచిలువ వెంటనే చెట్లపొదల్లోకి వెళ్లింది. కొండచిలు ఆ ప్రాంతంలో సంచరిస్తుండడంతో పనులు చేసేందుకు భయపడుతున్నట్లు కూలీలు తెలిపారు.



మద్దూరులో రెండిళ్లలో చోరీ

ప్రజాశక్తి - చాగలమర్రి : మండలంలోని మద్దూరు గ్రామంలో ఒకే రోజు రెండు ఇళ్లల్లో చోరీ జరిగిన ఘటన మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలు.. మండలంలోని మద్దూరు గ్రామానికి చెందిన బాలయ్య కుటుంబీకులు మంగళవారం రాత్రి ఇంటికి తాళం వేసి మిద్దెపై పడుకున్నారు. ఉదయం లేచి చూసే సరికి గుర్తు తెలియని దుండగులు ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలోని దాదాపు 7 తులాల బంగారు ఆభరణాలు, రూ. లక్ష నగదును ఎత్తుకెళ్లారని బాధితులు తెలిపారు. అలాగే మద్దూరు గ్రామానికి చెందిన థామస్ కుటుంబీకులు గత రెండు రోజులుగా చాగలమర్రిలో మరో ఇంటి నిర్మాణంలో ఉన్నారు. బుధవారం గ్రామంలోని ఇంటికి రాగా బీరువా పగుల గొట్టి దాదాపు ఏడు తులాలకుపైగా బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లినట్లు పోలీసులు తెలిపారు. విషయం తెలుసుకున్న ఎస్సై రమణయ్య గ్రామానికి చేరుకుని చోరీ జరిగిన ఇళ్లను పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని వివరించారు.

వైఎస్ఆర్ బీమా ఆర్థికసాయం అందజేత


ప్రజాశక్తి - బనగానపల్లె : మండలంలోని చిన్న రాజుపాలెం గ్రామంలో పోతుగంటి నవ నారాయణ మృతి చెందడంతో వారి కుటుంబానికి వైఎస్ఆర్ బీమా తక్షణ సహాయం రూ 10 వేలు పసుపల గ్రామపంచాయతీ సర్పంచ్ మూల మోహన్ బాబు గౌడ్ బుధవారం అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి సుబ్బమ్మ, వైసిపి నాయకులు పాపన్న, హుస్సేని, డబ్ల్యూఈఎ రమేష్, వాలంటీర్లు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి : సిపిఎం

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్ : మండలంలోని పార్నపల్లి గ్రామంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డికి సిపిఎం నాయకులు రత్నమయ్య, డేవిడ్, సుబ్బ రాయుడు, రాజులు వినతిపత్రం బుధవారం అందజేశారు. గ్రామంలో రైతు భరోసా కేంద్రం, కమ్యూనిటీ హాల్‌కు ప్రహరీ గోడ, హెల్త్ సబ్ సెంటర్ పున:నిర్మించాలని, డ్రైనేజ్ కాలువలు ఏర్పాటు చేయాలని, గృహ నిర్మాణాలకు రూ.5 లక్షలకు పెంచాలని సిపిఎం నాయకులు కోరారు. ఎమ్మెల్యే స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారు.

వైభవంగా ఆలయ ప్రథమ వార్షికోత్సవం

ప్రజాశక్తి - రుద్రవరం : రుద్రవరం సమీపంలోని అప్పనపల్లె ప్రధాన రహదారిలో వెలసిన వాసాపురం వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు బుధవారం వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా నిర్వహించిన శాంతిహోమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ వేడుకలకు మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డి, ఆళ్లగడ్డ మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ గంధం రాఘవరెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారికి ఆలయ నిర్వాహకులు మధుసూదన్ రెడ్డి, లింగం వెంకట రంగనాయకులు శెట్టి, నరసింహులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. హోమ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. అనంతరం నిర్వాహకులు వారిని శాలువా, పూలమాలలతో సన్మానించి జ్ఞాపికలను అందజేశారు.



హోమం కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డి, ఆళ్లగడ్డ మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ గంధం రాఘవరెడ్డిలు

అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - చాగలమర్రి : మండల, గ్రామాలలో విధులు నిర్వహిస్తున్న అధికారులు చిత్తశుద్ధితో పని చేసి ప్రజల మన్ననలు పొందాలని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి కోరారు. బుధవారం చాగలమర్రి పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో ఎంపీపీ రామిశెట్టి వీరభద్రుడు అధ్యక్షతన జరిగిన మండల పరిషత్ సర్వ సభ్య సాధారణ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మండలంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. జగనన్న లే అవుట్లలో, ఇళ్ళ నిర్మాణాలలో ఎటువంటి లోపాలు లేకుండా చూడాలని, తాగునీటి సమస్యలు, పారిశుద్ధ్యం లోపించకుండా చూడాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యేను ఎంపీపీ తదితరులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జడ్పిటిసి లక్ష్మిదేవి, వైస్ ఎంపిపిలు ముల్లా రఫి, ఆశీర్వాదమ్మ, మండల కో ఆప్షన్ సభ్యులు ఇబ్రహీం, ఎంపీటీసీలు పత్తి నారాయణ, లక్ష్మిరెడ్డి, నరసింహులు, షంషాద్, షాహిదా, బేబమ్మ, రాజేశ్వరి, ఫయాజ్, సింగిల్ విండో అధ్యక్షుడు దస్తగిరి, ఎంపీడీవో భాగ్యలక్ష్మి, డిటి శ్రీనివాసులరెడ్డి, ఏఓ రంగ నేతాజి పశువైద్యాధికారులు సాయిబాబా,దీప,మండల వైద్యాధికారులు ఇమ్రాన్, సుల్తానా, ఎంఈఓ అనురాధ, ఏఓ రంగనేతాజి, ఈఓఆర్‌డి నాగేంద్రయ్య, ఏఈలు కొండారెడ్డి, జగ్గయ్య, షఫివుల్లా, షాజహాన్, ఏపీవో నిర్మల,ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సుశీలమ్మ, ఏపిఓ నిర్మల, వివిధ గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కులాల వారిగా ఉపాధి పనులు దారుణం : వ్యకాస

ప్రజాశక్తి - నంద్యాల రూరల్

గోస్పాడు మండలంలోని పసురుపాడు గ్రామంలో కులాల వారిగా కూలీలకు ఉపాధి పనులు కల్పించడం దారుణమని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం సుధాకర్, గోస్పాడు మండల కార్యదర్శి చెన్నయ్య అన్నారు. బుధవారం గ్రామ సమీపంలో జరుగుతున్న ఉపాధి పనులను వారి పరిశీలించి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టానికి విరుద్ధంగా కులాలవారీగా పనులు కల్పించడం సిగ్గుచేటన్నారు. పని చేసే చోట సౌకర్యాలు లేకపోవడం వల్ల కూలీలు ఇబ్బంది పడుతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే మౌలిక సదుపాయాలు కల్పించాలని, ఫోటో యాప్ రద్దు చేయాలని, ప్లే షిప్పులు ఇవ్వాలని, పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 15న కలెక్టర్ ఆఫీస్ ముందు జరిగే ధర్నాలో ఉపాధి కూలీలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధి కూలీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

ఘనంగా జాతర ఉత్సవాలు

ప్రజాశక్తి - అవుకు : అవుకు మండలంలోని వేములపాడు గ్రామంలో దుర్గమ్మ, మారెమ్మ జాతర ఉత్సవాలు బుధవారం ఘనంగా జరిగాయి. గ్రామంలో మూడు దశాబ్దాల తర్వాత దేవర ఉత్సవాలు జరగడంతో బంధువులు, ప్రజలు, నాయకులతో గ్రామంలో సందడి నెలకొంది. టిడిపి నాయకుల పిలుపుమేరకు బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బిసి జనార్దన్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలను నిర్వహించి కానుకలను సమర్పించారు. గ్రామ సర్పంచి మూరబోయిన గుర్రప్ప దంపతులు మాజీ ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. ఈ జాతరలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అవుకు ఎస్సై జగదీశ్వర్ రెడ్డి పోలీస్ సిబ్బందితో గట్టి బందోబస్తు నిర్వహించారు.

మాజీ ఎమ్మెల్యేకు స్వాగతం పలుకుతున్న నాయకులు



రహదారి మరమ్మతులు చేపట్టండి

ప్రజాశక్తి - సంజామల

మండలంలోని సంజామల-ముదిగేడు రహదారి గుంతలు పడి ప్రయాణానికి ఇబ్బందిగా ఉందని, వెంటనే మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు, సంజామల, ముదిగేడు గ్రామాల ప్రజలు అధికారులను కోరుతున్నారు. ఆరు నెలల క్రితం రోడ్డును మరమ్మతులు చేయడానికి అధికారులు ఉన్న రోడ్డును తవ్వారని, కానీ ఇంతవరకు మరమ్మతులు చేయలేదన్నారు. రెండు గ్రామాల మధ్య ప్రయాణం చేయాలంటే చాలా ఆలస్యం అవుతుందని, ఆటోలు, మోటార్ సైకిల్ ప్రయాణానికి చాలా ఇబ్బందిగా ఉందని ప్రజలు తెలిపారు. ఎన్నోసార్లు మోటార్ సైకిల్ మీద నుంచి కిందపడి గాయాలయిన సంఘటనలు ఉన్నాయని మోహన్, లక్ష్మయ్యలు తెలిపారు. ఇప్పటికైనా రహదారి మరమ్మతులు చేసి ప్రయాణానికి ఇబ్బంది లేకుండా చూడాలని వాహన దారులు, గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



గుంతలు పడిన రోడ్డు దుస్థితి

ఆలయ భూముల కౌలుకు వేలం పాటలు

ప్రజాశక్తి - రుద్రవరం : మండలంలోని ఎల్లా వత్తుల గ్రామంలో బుధవారం దేవాలయ భూముల కౌలు వేలం పాటలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయ కార్య నిర్వహణ అధికారి నరసయ్య మాట్లాడుతూ గ్రామంలో ఉన్న నరసింహస్వామి, ఈశ్వర స్వామి ఆలయాల సంబంధించి 47 ఎకరాల భూములకు ఈ ఏడాది రూ.4.24 లక్షలకు వేలం పాడారన్నారు. గత ఏడాది కంటే ఈ ఏడాది రూ 2.10 లక్షల ఆదాయం వచ్చిందన్నారు. ఈ వేలం పాటల్లో గ్రామ సర్పంచ్ చంద్రమోహన్, గ్రామ పెద్దలు రైతులు పాల్గొన్నారు.

రసవత్తరంగా రాతి దూలం పోటీలు

ప్రజాశక్తి - అవుకు

అవుకు పట్టణంలో భూలక్ష్మి సమేత చెన్నకేశవ స్వామి తిరు కళ్యాణ మహోత్సవంలో భాగంగా చివరి రోజు బుధవారం రాతిదూలం పోటీలు రసవత్తరంగా జరిగాయి. ఈ పోటీల్లో ఎనిమిది జతలు వృషభాలు పాల్గొన్నట్లు రైతు సంఘం పెద్దలు తెలిపారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో ఏర్పాటు చేసిన ఎద్దుల పందెం పోటీలను వైసిపి యువ నాయకులు చల్లా విగ్నేశ్వర్ రెడ్డి ప్రారంభించారు. ఈ పోటీల్లో మొదటి విజేతగా పెద్ద కొట్టాల గ్రామానికి చెందిన బోరెడ్డి కేశవరెడ్డి ఎద్దులు రూ. 80 వేలు సాధించాయి. రెండవ బహుమతి గోర్లగుట్ట గ్రామానికి చెందిన బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఎద్దులు రూ.60 వేలు, మూడో బహుమతి చిన్న కానాల గ్రామానికి చెందిన గుండం చెన్నారెడ్డి రూ.40 వేలు, నాలుగవ విజేత అనంతపురం జిల్లా సోడనపల్లె గ్రామానికి చెందిన లింగుట్ల ప్రసాద్ నాయుడు వృషభాలు రూ.30 వేలు, ఐదవ విజేత సీసం గుంతల గ్రామానికి చెందిన ఆళ్ల మదన్మోహన్ రెడ్డి ఎద్దులు రూ.20 వేలు గెలుచుకున్నాయి. కార్యక్రమంలో వైసిపి నాయకులు చల్ల సూర్యప్రకాశ్ రెడ్డి, చల్లా రాజశేఖర్ రెడ్డి, చల్లా భాస్కర్ రెడ్డి, చల్లా రఘునాథరెడ్డి, దుగ్గిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, పోతిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మోట్ల రాంరెడ్డి, రైతు సంఘం పెద్దలు పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న వైసిపి నాయకులు చల్లా విగ్నేశ్వర్ రెడ్డి

బాధిత కుటుంబాలను ఆదుకుంటాం

- ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ బృందం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్ : సిలిండర్లు పేలి ధ్వంసమైన ఇళ్ల బాధిత కుటుంబాలకు రెడ్ క్రాస్ సొసైటీ అండగా ఉంటుందని, త్వరలోనే ఆర్థిక సహాయం అందిస్తామని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా బ్రాంచ్ సెక్రటరీ డాక్టర్ మమతారెడ్డి భరోసా ఇచ్చారు. ఇటీవల నంద్యాల పట్టణంలో గ్యాస్ సిలిండర్లు పేలి పొన్నాపురం కాలనీలో ఒక ఇల్లు, సాయిబాబా నగర్‌లో రెండు ఇల్లు ధ్వంసం అయిన ఇళ్లను పరిశీలించి బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా డాక్టర్ మమతా రెడ్డి మాట్లాడుతూ మూడు కుటుంబాల గురించి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీకి నివేదిక పంపి సహాయం కోరుతామని, త్వరలోనే రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో వీరికి సహకారం అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లా కోశాధికారి నాగేశ్వరరావు, నంద్యాల మండల ప్రతినిధులు నాగేశ్వర్ రెడ్డి, సోహెల్ తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

ప్రజాశక్తి బనగానపల్లె : యువత చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి థాయ్ బాక్సింగ్ రాష్ట్ర చైర్మన్ బీసీ ఇందిరా పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో కొలిమిగుండ్ల మండలం పెద్దవెంతుర్ల గ్రామానికి చెందిన యువకులకు బిసి ఇందిరా క్రికెట్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువకులు వేసవికాలంలో ఎడదారి పట్టకుండా క్రీడలపై దృష్టి సారించాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను చదువుతోపాటు క్రీడల్లో ప్రోత్సహించాలని తెలిపారు.

బడి బయట పిల్లలను బడిలో చేర్పించాలి

ప్రజాశక్తి - పగిడ్యాల : బడి బయట పిల్లలను గుర్తించి బడిలో చేర్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎంఈఓ సుభాన్ ప్రధానోపాధ్యాయులకు సూచించారు. బుధవారం స్థానిక ఎమ్మార్సీ భవనంలో హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడారు. చదువుకోవాల్సిన పిల్లలు పనులకు వెళ్లకుండా వారిని బడిలో చేర్పించాలన్నారు. పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించి పాఠశాలలో చేర్పించి వారికి విద్యను అందించే విధంగా కృషి చేయాలన్నారు. మనబడి నాడు-నేడు పథకం కింద పాఠశాలల అభివృద్ధి పనులను పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. పనులను నాణ్యతతో చేపట్టాలన్నారు. అనంతరం రాగిజావ పంపిణీకి స్టీల్ గ్లాసులను, టీచింగ్ పుస్తకాలను హెచ్‌ఎంలకు అందజేశారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడు మృతి

ప్రజాశక్తి - చాగలమర్రి : చాగలమర్రికి చెందిన వ్యాయామ ఉపాధ్యాయుడు ఏసుబాబు (53) గుండెపోటుతో బుధవారం మృతి చెందారు. విషయం తెలిసిన వైసిపి రాష్ట్ర మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ బాబూలాల్ అతని ఇంటి వద్దకు చేరుకొని భౌతిక కాయంపై పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఏసుబాబు ఎంతో మంచి వ్యక్తి అని, మంచి వ్యాయామ ఉపాధ్యాయునిగా పేరు తెచ్చుకున్నారని ప్రశంసించారు. అతడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు గణేష్ రెడ్డి, విద్యా కమిటీ చైర్మన్‌లు మాబుసున్నా, అబ్దుల్లా ఆళ్లగడ్డ వ్యవసాయ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ ముల్లా జాబిర్, వైసిపి నాయకులు ముల్లా ఖాదర్బాషా, షేక్ షబ్బీర్, ముల్లా ఇబ్రహీం , జల్సా గౌస్, లడ్డు భాష , బబ్లు , ఖదీర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే వ్యాయామ ఉపాధ్యాయుడు మృతి పట్ల పలువురు ఉపాధ్యాయులు సంతాపం వ్యక్తం చేశారు.

గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం

ప్రజాశక్తి - నంద్యాల రూరల్ : గోస్పాడులోని గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఇందులో భాగంగా పిల్లలకు పుస్తక పఠనం, కథలు చెప్పడం జరిగింది. నారా చంద్రశేఖర్ రెడ్డి, గ్రంథాలయం అధికారి వజ్రాల భవాని తదితరులు పాల్గొన్నారు.